
0933520440
09305978486
09794359502
PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్



Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.



RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 225 విశాఖపట్నం, 20 జూన్ 2023 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## విశాఖ పాతబస్తీలో కూలిన ఇల్లు

### గాయాలతో బయటపడిన బాధితులు
### ఊపిరి పీల్చుకున్న స్థానికులు
### 40ఏళ్ల క్రితం నాటి భవనం





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ వన్‌టౌన్‌లో మరో పురాతన భవనం కుప్పకూలిపోయింది. సోమవారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడిరది. దీంతో వర్షానికి ఇల్లు నానిపోయి కూలి పోయినట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో బాధితులు గాయాలతో బయటపడగా వారికి ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. వన్‌టౌన్ సీఐ రేవతమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టౌన్ కొత్త రోడ్డు నుంచి మార్కెట్‌కు వెళ్లే దారిలో 26-8-64అనే ఇల్లు ఉంది. రాజారామ్మోహన్ రాయ్ రోడ్డులోని కెనాల్ రోడ్డు ప్రాంతంలో ఎస్‌పీ ఎంటర్‌ప్రైజెస్ అనే చెప్పుల దుకాణం ఉంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అన్నదమ్ములు కలిపి అదే ఇంట్లో ఉంటున్నారు. ఇల్లు కూలి పోయిన సంఘటనలో ఆ కుటుంబానికి చెందిన చిట్టిబోయిన నాగరాజు (50) కుడిచేయి వేలు తెగిపడగా, ఆయన కుమారుడు ప్రవీణ్ (5) కాలు విరిగింది. ఇంట్లో మొత్తం 8మంది ఉంటుండగా, వారిలో ఇద్దరికి గాయాలయ్యాయి. మిగతా వారంతా క్షేమమేనని స్థానికులు చెబుతున్నారు. కూలిన సమయంలో వారంతా ఇంట్లోనే ఉండగా, సంఘటన అనంతరం పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి వారిని సురక్షితంగా బయటకు తీసుకు రాగలిగారు. స్థానికులు గుడివాడ హరిబాబు సోమవారం తెల్లవారుజామున ఘటనను చూసి పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. ఇద్దరు వ్యక్తులు గాయాలతో బయటపడగా, మిగతా గుబ్బల రాంబాబు, నవీన్, మధు, చిట్టిబోయిన వరలక్ష్మి, సింహాచలం, బొంతు రాజు క్షేమంగానే ఉండడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

**పట్టించుకోని జీవీఎంసీ:** విశాఖ కలెక్టరేట్ సమీపంలోనే ఇటీవల ఇల్లు కూలిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. అదే విధంగా మరో ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరికొందరు బయటపడ్డారు. తాజాగా సోమవారం నాటి ఘటన కూడా స్థానికుల్ని భయకంపితుల్ని చేసింది. ఇంత జరుగుతున్నా జీవీఎంసీకి ఏమీ పట్టడం లేదు. నగరంలో సుమారు 327ఇళ్లు కూలిపోయే దశలో

(మిగతా 2లో)

## పోలవరంతో పాటు ప్రాధాన్యతా ప్రాజెక్టులపై జగన్ సమీక్ష



రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులపై సీఎం జగన్ ఇవాళ క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తాజా పరిస్థితిని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం మొదలుకానున్న తరుణంలో ప్రాజెక్టుల నిర్మాణంలో ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులకు తగు సూచనలు చేశారు. అలాగే ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు కూడా ఇచ్చారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ గడువు సమీపిస్తున్న కొద్దీ లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై కూడా దృష్టిపెట్టాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతంలో పనులు చురుగ్గా సాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్-1లో శాండ్ ఫిల్లింగ్, వైబ్రోకాంపాక్షన్ పనులు పూర్తయ్యాయన్నారు. గ్యాప్-2 పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయన్నారు. కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జలమండలి అధికారులు గైడ్ బండ్‌లో కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారని, నేల స్వభావంలో మార్పుల కారణంగా ఇది జరిగి ఉండొచ్చని అనుమానాన్ని కమిటీ వెల్లడించిందన్నారు.

దెబ్బతిన్న ప్రాంతాన్ని రాక్ డంప్‌తో, సిమెంట్ స్లర్రీతో నింపాలని, గేబియన్స్‌తో సపోర్టు ఇవ్వాలని కమిటీ సూచించిందన్నారు. పూర్తి విశ్లేషణ తర్వాత శాశ్వతంగా చేయాల్సిన మరమ్మతులను సూచిస్తామని కమిటీ చెప్పినట్టుగా వెల్లడించారు. పోలవరం తొలిదశను పూర్తిచేయడానికి కేంద్ర ఆర్థికశాఖ రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని, కేంద్ర కేబినెట్లో పెట్టేందుకు కేబినెట్ నోట్ తయారీపై వివిధ మంత్రిత్వశాఖల

(మిగతా 2లో)

## కాల పరిమితి లోగా అర్జీలను పరిష్కరించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కాల పరిమితిలోగా ప్రజల నుండి వచ్చు అర్జీలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా',, ఎ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ''జగనన్నకు చెబుదాం'' కార్యక్రమంలో ఆయన పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం వెబ్ సైట్ లో నమోదైన

(మిగతా 2లో)

## ప్రధాన గెడ్డలోని పూడికలు తొలగించండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నగరంలోని ప్రధాన గెడ్డలోని పూడికలు తొలగించాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ ప్రజారోగ్యపు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 6 వ జోన్ 76వ వార్డు పరిధిలోని జగ్గు జంక్షన్, కణితి రోడ్డు, పెదగంట్యాడ, నడిపూరు ఏ పీ హెచ్ బి కాలనీ, గంగవరం పోర్టు రోడ్డు తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనుతో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని నగరంలోని ప్రధాన గెడ్డలోని పూడికలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు పై వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్య

(మిగతా 2లో)

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎయిర్ పోర్ట్ నూతన డైరెక్టర్ ఎస్. రాజారెడ్డి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన రాజారెడ్డి సోమవారం మధ్యాహ్నం విఎంఆర్డిఎ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా.ఎ మల్లిఖార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ ఎస్.రాజా రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్ మాట్లాడుతూ విస్తీర్ణ పరంగా విశాఖ జిల్లా చిన్నదైనా ఆర్థిక పరంగా రాష్ట్రంలో ముందుందని అన్నారు . ప్రతిరోజూ విశాఖ నుండి జాతీయంగా, అంతర్జాతీయంగా పలు విమాన రాకపోకలు నిర్వహిస్తుందని అన్నారు. అంకితభావంతో పని చేసి టూరిస్టులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విశాఖ ఎయిర్ పోర్ట్ కు మంచి పేరు తీసుకురావాలని ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ కు కలెక్టర్ సూచించారు.

జిల్లా యంత్రాంగం తరపున ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని అన్నారు.

## జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఐసిడిఎస్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు, బాలింతలకు ఇచ్చే నిత్యవసర వస్తువులు బియ్యం, కందిపప్పు, నూనె, వైఎస్ఆర్ కిట్స్ ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతినెలా సరఫరా చేయాలని పౌర సరఫరాల అధికారులకు ఆదేశించారు.

ఎస్ డి జి ఇండికేటర్స్, బాలింతలో రక్తహీనత, బరువు తక్కువగా ఉన్న పిల్లలు ఆయా వివరాలు అంగన్వాడి సూపర్వైజర్లను అడిగి తెలుసుకున్నారు మళ్లీ వచ్చే సమావేశం నాటికి పూర్తి వివరాలు తీసుకురావాలని అంగన్వాడీ సూపర్వైజర్లను ఆదేశించారు. నాడు నేడు పనుల్లో భాగంగా అంగన్వాడి కేంద్రాల్లో పనులు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సూపర్వైజర్లు పిల్లలు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి డి.వెంకటేశ్వరి, జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు, సిడిపిఓలు ఎం.వి రమణ కుమారి, డి నీలమణి, ఎం శ్రీదేవి, ఎల్ సుజాత, అంగన్వాడీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## సిద్ధరామయ్య సర్కార్‌కు ఉప ఎన్నిక సవాల్



బెంగళూరు: కిందటి నెలలో అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొంది కర్ణాటక. 224 అసెంబ్లీ స్థానాలకు మే 10వ తేదీన జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయాన్ని సాధించింది. 135 స్థానాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి వరకు అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ 66 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. కుమారస్వామి సారథ్యంలోని జనతాదళ్ (సెక్యులర్)-19, ఇతరులు నాలుగు చోట్ల విజయం సాధించారు.

సరిగ్గా నెలన్నర రోజుల వ్యవధిలో కర్ణాటకలో మరోసారి ఎన్నికల నగారా మోగింది. శాసన మండలిలో ఖాళీగా ఉన్న మూడు స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఇదివరకే కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ముగ్గురు శాసన మండలి సభ్యులు తమ సభ్యత్వానికి రాజీనామా చేయడం వల్ల ఈ ఎన్నికలు అవసరం అయ్యాయి.

బీజేపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు- బాబూరావ్ చించనాసుర్, రామచంద్రప్ప శంకర్, లక్ష్మణ సవాది తమ సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వారిలో బాబూరావ్ చించనాసుర్ మార్చి 20వ తేదీన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఏప్రిల్ 12వ తేదీన ఆర్ శంకర్, అదే నెల 14వ తేదీన లక్ష్మణ సవాది.. శాసన మండలి ఛైర్మన్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బాబూరావ్ చించనాసుర్, లక్ష్మణ సవాది- అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. అథణి నుంచి పోటీ చేసిన లక్ష్మణ సవాది ఘన విజయం సాధించగా.. గుర్మిట్‌కల్ నుంచి బరిలోకి దిగిన బాబూరావ్ ఓటమి పాలయ్యారు. బాబూరావ్- 2024 జూన్ 17, ఆర్ శంకర్- 2026 జూన్ 30, లక్ష్మణ సవాది- 2028 జూన్ 14వ తేదీ నాటికి పదవీ కాలం ముగియాల్సి ఉంది.

ఈ లోపే వారు తమ శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేయడం వల్ల ఉప ఎన్నికలు అవసరం అయ్యాయి. ఈ మూడు స్థానాలు కూడా ఎమ్మెల్యేల కోటాకు సంబంధించినవి. దీనికి ఈ నెల 20వ తేదీన నామినేషన్ పత్రాలను దాఖలు చేయాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రాల ఉపసంహరణ గడువు.. ఈ నెల 23వ తేదీ. ఈ నెల 30వ తేదీన పోలింగ్‌ను షెడ్యూల్ చేసింది ఈసీ.

(మిగతా 2లో)

## మత్స్యకారులకు ప్రోత్సాహం అందిస్తే స్విమ్మింగ్ క్రీడలో రాణిస్తారు: పవన్ కల్యాణ్



జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కాకినాడలో మత్స్యకారులతో సమావేశమయ్యారు. మత్స్యకారుల్లోనూ ఎంతో మంచి స్విమ్మర్లు ఉన్నారని, వారికి గనుక సరైన ప్రోత్సాహం అందిస్తే స్విమ్మింగ్ క్రీడలో రాణిస్తారని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. మత్స్యకారుల జీవనశైలికి ఆక్వాస్పోర్ట్స్ దగ్గరగా ఉంటాయని పేర్కొన్నారు.

మత్స్యకార వృత్తిని వ్యవసాయంతో సమానంగా చూడాలని అన్నారు. సీఎం జగన్ లా అద్భుతాలు చేస్తానని చెప్పను గానీ, నేను మీ కోసం పనిచేస్తాను అని స్పష్టం చేశారు. మత్స్యకారుల వంటి ఉత్పత్తి కులాలకు ఇసుక వంటి సహజ ఖనిజాల కాంట్రాక్టులు ఇస్తే వారిలో ఆర్థిక అసమానతలు తొలగించవచ్చని పేర్కొన్నారు.

మత్స్యకారులు సరైన నాయకులను ఎన్నుకోవాలని, మత్స్యకారులకు జనసేన అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ తెలిపారు.

"ఈసారి ఎన్నికల్లో జనసేన పార్టీకి మద్దతు తెలపాలని మత్స్యకారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి జనసేన ప్రభుత్వం స్థాపించేందుకు అండగా ఉండండి. ఈసారి ఎన్నికల్లో జనసేన ఎంపీ అభ్యర్థులను గెలిపించండి. మీ కోసం మరింత బలంగా పనిచేస్తాను. ఏ పదవి లేకపోయినా ప్రధాని మోదీ నాకు గౌరవం ఇస్తున్నారు. అదే మీరు మమ్మల్ని గెలిపిస్తే కేంద్ర మంత్రులతో మాట్లాడి మీ కోసం పనిచేయగలను.

జనసేన పార్టీ అధికారంలోకి వస్తే దివీస్ వంటి పరిశ్రమలు సముద్ర తీరప్రాంతానికి దగ్గరగా వ్యర్థాలు వదలకుండా, పర్యావరణానికి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటాను. నేను పరిశ్రమలకు వ్యతిరేకం కాదు... కానీ పరిశ్రమలు మీ జీవితాలను, ఉపాధిని దెబ్బతీసేలా ఉంటే చూస్తూ ఊరుకోను. మత్స్యకారులకు సొంత పడవలు ఉండేలా సాయం చేస్తాం" అని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.

# మా నీటికష్టాలు తీర్చండి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మా వాంబే కాలనీ నీటి కష్టాలు తీర్చండి మహాప్రభు అంటూ గాజువాక జోనల్ 6 మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన కాలనీ మహిళ వాసులు గాజువాక 65వ వార్డు కొండవల ప్రాంతం వంబే కాలనీలో బోర్లు గాని బావులు గాని లేని ప్రాంతం ఒక మున్సిపల్ నీటి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నామని వంబే కాలనీలో గత కొంతకాలంగా నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గత 18 ఏళ్లుగా ఇంటి పన్ను నీటి పన్ను ఆఖరికి చెత్త పన్ను కూడా కట్టుకుంటూ వస్తున్నామని పలుమార్లు జోనల్ కమిషనర్ గారికి వాటర్ ఏఈకి స్థానిక కార్పొరేటర్ గారికి ఈ నీటి సమస్యపై వినతిపత్రం అందజేశామని కానీ జోనల్ కమిషనర్ గారు గారు వాటర్ ఏఈ గారు కన్నెత్తి వాంబే కాలనీ వైపు చూడలేదని స్థానిక మహిళలు వాపోయారు వారికి మద్దతుగా 65వార్డ్ టిడిపి అధ్యక్షులు రట్టి వాసు .వార్డ్ ఇంచార్జ్ బైపిలి గాంధీ . వార్డ్ ఉపాధ్యక్షులు దాట్ల శ్రీనివాస్ రావు. టిడిపి నాయకులు కెవిఎస్ ప్రసాద్. %=%.సంతోష్. ధర్నా కూ మద్దతు తెలిపారు అనంతరం వార్డ్ నాయకులు రట్టి వాసు. బైపిల్లి గాంధీ మాట్లాడుతూ తక్షణమే నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేనియెడల తెలుగుదేశం పార్టీ తరఫున కాలనీ వాసులతో విశాఖ జిల్లా పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు మాజీ గాజువాక శాసనసభ్యులు లిశ్రీ పల్లా శ్రీనివాసరావులిలిదృష్టికి తీసుకెళ్లి వాంబే కాలనీ 672 కుటుంబాలతో పార్టీ నాయకులతో కలిసి బిందెలతో మహా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు అనంతరం కాలనీ మహిళ వాసులతో వార్డ్ టిడిపి నాయకులు వినతిపత్రం అందజేయడం జరిగింది.

# ఘనంగా గుంటూరు రామారావు సంస్మరణ కార్యక్రమం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దివగంత గుంటూరు రామారావు సంస్మరణ కార్యక్రమం సరిపల్లి గ్రామంలో జరిగింది. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లా కు ప్రధానంగా గ్రామీణ ప్రాంతంలో రామారావు చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్, ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, జీవిఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అదనపు కమిషనర్ యాదగిరి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పి విష్ణుకుమార్ రాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి టి శివశంకర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుకులు ద్రోణంరాజు శ్రీ వాస్తవ్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్ తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతల పూడి వెంకటరామయ్య,

పెందుర్తి ఎంపిపి మధుపాడ నాగమణి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, రెడ్డి నారాయణరావు, కాపు నేతలు వంగా వెంకట ప్రభాకర్, నారా నాగేశ్వరరావు, తోట రాజీవ్, తోట దుర్గారావు, బి ఎన్ మూర్తి,

సరిపల్లి గ్రామ సర్పంచ్ గొర్లె రామకృష్ణ, జడ్పీటీసీ గొల్లవిల్లి రమణ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావు, గుంటూరు సత్య గణపతి రావులు కృతజ్ఞతలు తెలిపారు.

# నిర్ణీత కాల్యవవధిలోపల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నేడు టిడ్కో చైర్మన్ .జమ్మాన ప్రసన్న కుమార్ అధికారిక పర్యటనలో భాగంగా యలమంచిలిలో నిర్మాణములో ఉన్నటువంటి 432 గృహాలు,సత్యనారయణపురం లో 2744 గృహాలు,సిరసపల్లి 384 గృహాలు,కొండ కొప్పాక 288 గృహాలు మరియు దబ్బందలో 1920 మొత్తంగా కలిసి 5768 గృహ నిర్మాణ పనులను టిడ్కో ఇంజనీరింగ్ మరియు కాంట్రాక్టింగ్ ఏజన్సీ సిబ్బందితో కలిసి పరిశీలించడం జరిగింది.లి

తదుపరి టిడ్కో ఇళ్లకు సంబందించి (హౌసింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్) యొక్క పనుల పురోగతిని సంభందిత ఇంజనీరింగ్ అధికారులు మరియు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బందితో కలిసి పర్యటించి తదుపరి వారితో సంయుక్తంగా చర్చించడంతో పాటుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీతకాలవ్యవధిలోపల ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులకు మరియు ఏజేన్సీ సిబ్బందికి తెలియజేయటం జరిగింది. ఇంకనూ పూర్తి చేయవలసిన గృహ సముదాయాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి ఎలమంచిలి జూన్ నాటికి 432 గృహాలు మరియు జూలై చివరి నాటికి 5336 మొత్తంగా 5768 గృహాలు లబ్ధిదారులకు అందించే దిశగా కార్యాచరణ చేపట్టాలని కాంట్రాక్టింగ్ ఏజెన్సీ వారికి అధికారులకు ఆదేశించడం జరిగింది.

ఇప్పటికే రాష్టం మొత్తము మీద విజయనగరం, ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి వెస్ట్ గోదావరి ఉమ్మడి నెల్లూరు ఉమ్మడి కర్నూల్ జిల్లాలో, ఉమ్మడి క్రిష్ణా జిల్లాలో ఇప్పటికే 69 వేలు గృహాలు అందించడం జరిగింది తదుపరి ఈ జూన్ నుండి సెప్టెంబర్ 2023 వరకు ప్రభుత్వం నిర్దేశించిన విధముగా ఒక లక్షా యాభై వేల ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమములో భాగముగా చేయవలసిన హౌసింగ్ మురుగు నీటి శుద్ధి (ఎస్ టి పి ) ఇన్ఫ్రాస్ట్రక్చర్ ( రోడ్లు మంచినీటి డ్రైనేజీ ఎలక్ట్రికల్ ) అన్ని పనులు పూర్తి చేసి అన్ని సదుపాయాలతో ఇళ్లను లబ్ధిదారులుకు అందించాలని అధికారులుకు ఆదేశించడమైనది.లి

పై ఈ కార్యక్రమంలో పత్రికా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కేవలం ఒక్క రూపాయికే ఇళ్ళు ఇవ్వడంతో పాటుగా ప్రతీ ఇంటికి సుమారుగా 60 నుండి 70 వేల వరకు అయ్యే రిజిస్ట్రేషన్ ఫీజుల మొత్తము లబ్దిదారుల పై భారం పడకుండా ఆ మొత్తము ప్రభుత్వమే భరించే విధముగా నిర్ణయం తీసుకోవడం అనేది పేదల ఇళ్ళ పట్ల ముఖ్యమంత్రి గారికి ఉన్నటువంటి చిత్త శుద్ధికి నిదర్శనమని తెలియజేయడం జరిగింది,అదే విధముగా 365 మరియు 430 చదరపు అడుగుల ఇళ్ళ లబ్దిదారులు చెల్లించాల్సిన ముందస్తు వాటా దనములో కూడా 50% మొత్తము తగ్గించి టిడ్కో లబ్దిదారులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చిన ఘనత మన ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుంది అని అనుటలో ఏటువంటి అతిశయోక్తి లేదు అని చెప్పడం జరిగింది.

అదే విధముగా లబ్ధిదారులకు రుణాల మంజూరు కల్పించే విషయములో మెప్మా, జి.వి.యం.సి మరియు టిడ్కో అధికారులు కలిసి సమన్వయముతో పనిచేయాలని సూచించడం జరిగింది.

పైన తెలిపిన ఈ కార్యక్రమంలో టిడ్కో సూపరెంటెన్డింగ్ ఇంజనీర్ శ్రీ.డి.శ్రీ.నరసింహ మూర్తి, సంభందిత మునిసిపల్ కమీషనర్ వీరయ్య, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్, మరియు ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్, డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు ఉమా మహేశ్వరి గారు, అధికారులు వారి సహెూద్యోగులు మరియు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## (మొదటి పేజీ తరువాయిలు)

### విశాఖ పాతబస్తీలో కూలిన ఇల్లు

ఉన్నట్టు గతంలోనే అధికారులు గుర్తించారు. వాస్తవానికి ఆయా ఇళ్ళను తక్షణమే పడగొట్టకపోతే ఇలాంటి ప్రమాదాలు తప్పవు. మీ ఇల్లు మీరే కూల్చుకోవాలి అనే నిబంధన ఉండడంతో యజమానులు ఇంకెక్కడో ఉండడం, ఇల్లు కూల్చేందుకు వారి వద్ద తగిన డబ్బు లేకపోవడం కూడా జరుగుతోంది. దీంతో జీవీఎంసీయే చొరవ చూపాలని, ముఖ్యంగా వన్‌టౌన్‌లో చాలా చోట్ల పురాతన భవనాలున్నాయని, వాటిని తక్షణమే కూల్చకపోతే ముప్పుతప్పదని నగర వాసులు పేర్కొంటున్నారు.

### పోలవరంతో పాటు ప్రాధాన్యతా ప్రాజెక్టులపై జగన్ సమీక్ష

మధ్య సంప్రదిం పులు కొలిక్కి వస్తున్నాయని అధికారులు వెల్లడించారు. పోలవరం మొదటి దశ పరిధిలోకి వచ్చే 20,946 ముంపు బాధిత కుటుంబాల్లో 12,658 మందిని ఇప్పటికే తరలించామని, మిగిలిన 8,288 మందిని తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అలాగే ప్రభుత్వం ప్రాధాన్యతగా నిర్దేశించుకున్న ప్రాజెక్టుల పూర్తి ప్రత్యేక దృష్టిపెట్టాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు.ప్రతి 15 రోజులకోసారి పనుల ప్రగతిని సమీక్షించుకోవలన్నారు. ఈమేరకు కార్యాచరణ చేసుకుని వేగంగా వాటిని పూర్తిచేయాలన్నారు. వెలగొండ, వంశధార, అవుకు సహా పలు ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో పరిస్థితులను సీఎం సమీక్షించారు.

ఈ ప్రాజెక్టుల ప్రగతిని ముఖ్యమంత్రికి అధికారులు నివేదించారు. అవుకు రెండో టన్నెల్ నిర్మాణం పూర్తి, చివరిదశలో లైనింగ్ కార్యక్రమం ఉందని, ఆగస్టులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. అవుకు ద్వారా 20వేల క్యూసెక్కుల సముద్రంలో కలిసే కృష్ణా వరదజలాలను రాయలసీమ దుర్భిక్షప్రాంతానికి తరలించేందుకు మార్గం సుగమమైందని, వరదలు సమయంలో సముద్రంలో కలవకుండా నీటిని కరవుపీడిత ప్రాంతాలకు తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ పూర్తయ్యిందని, రెండోటన్నెల్ పనులుకూడా కొలిక్కివస్తున్నాయని అధికారులు తెలిపారు. రెండో టన్నెల్ హెడ్ రెగ్యులేటర్ పనులు 92.14శాతం పూర్తయ్యాని, ఆగస్టు నాటికి హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తిచేస్తామని వెల్లడించారు. టన్నెల్ తవ్వకం పనులు 18,787 మీటర్లకుగానూ, 17,461 మీటర్లు పూర్తిచేశామన్నారు.

నీటిని తరలించడానికి వీలైనంత తర్వగా మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా గొట్టిపాడు డ్యాం, కాకర్ల డ్యాం, తీగలేరు అప్రోచ్ ఛానల్, తీగలేరు హెడ్ రెగ్యులేటర్, ఈస్టర్న్ మెయిన్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయని అధికారులు తెలిపారు.

అనంతరం వంశధార పనులపైనా సీఎం సమీక్ష చేశారు. ఈ ఏడాది వంశధార స్టేజ్-2, ఫేజ్-2 కింద డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌ను కూడా పూర్తిచేస్తున్నామని అధికారులు తెలిపారు. గొట్టాబ్యారేజీ నుంచి కూడా ఎత్తిపోతల ద్వారా హిరమండలం రిజర్వాయర్‌ను నింపే కార్యక్రమం వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చాలన్నారు.

తోటపల్లి బ్యారేజీ కింద మిగిలిపోయిన పనులు, తారకరామ తీర్థసాగర్, మహేంద్ర తనయ రిజర్వాయర్లపై సీఎం సమీక్ష చేశారు. ఈ పనులన్నీ వేగంగా జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. వీటి తర్వాత ప్రాధాన్యతగా నిర్ణయించుకున్న కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయన్నారు. ఏపీ నాలుగు జాతీయ జల అవార్డులు (నేషనల్ వాటర్ అవార్డ్స్ 2022) దక్కించుకోవడంపై మంత్రి, అధికారులను సీఎం అభినందించారు.

### కాల పరిమితి లోగా అర్జీలను పరిష్కరించాలి

అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టరు చెప్పారు. పోర్టల్లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం పై నిర్లిప్తంగా ఉండరాదని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. అర్జీదారులకు ఇబ్బందులు కలిగించరాదని ఆయన సూచించారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలని,జగనన్నకు చెబుదాం పోర్టల్లో అర్జీలు పునరావృతం గాకుండా చూడాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి వాటికి పరిష్కార మార్గం చూపాలని ఆయన ఆదేశించారు.

ఎస్ ఎల్ ఎ పీరియడ్ అవ్వకముందే పిటిషన్ దారునితో మాట్లాడి వారికి వివరాలు తెలియజేసి పరిష్కరించాలన్నారు. ఎండార్స్ మెంట్ చేసేటప్పుడు అధికారులు దానిని నిర్ధారించి చేయాలన్నారు.

అర్జీదారునికి ఇచ్చే సమాధానం పూర్తి వివరాలుతో ఉండాలని, అసంపూర్తిగా లేకుండా చూడాలన్నారు. అధికారులు తమకు అందిన దరఖాస్తులను పూర్తిగా చదివి, ఒకవేళ అది తమ శాఖకు సంబంధించింది కానట్లయితే దానిని సంబంధిత అధికారులకు పంపాలని సూచించారు. ఎండార్స్ మెంట్ ఇచ్చేటప్పుడు ఫొటో తప్పనిసరిగా పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. గడువు తీరినప్పటికి వివిధ శాఖలలో అర్జీలు పెండింగ్ లో ఉండడంపై ఆయన ఆరా తీశారు.

సోమవారం జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో 210 విజ్ఞప్తులుఅందాయి.

ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే ఎస్ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ప్రధాన గెడ్డలోని పూడికలు తొలగించండి

పనుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వ్యర్థాలను ఎప్పటికప్పుడే శుభ్రం చేసి డంపింగ్ యార్డ్ కి తరలించాలని అధికారులను ఆదేశించారు.

కణితి రోడ్డు లో ఉన్న ప్రధాన గెడ్డ వర్షాకాలంలో పొంగి మురుగునీరు రోడ్డుపైకి వస్తున్నందున ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలని, డంపింగ్ యార్డ్ లో వద్ద గెడ్డను వెడల్పు చేయాలని, పెదగంట్యాడలోని శివాజీ పార్కును ఆధునికరించాలని స్థానిక కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా గంగవరం, స్టీల్ ప్లాంట్ సంబంధించిన అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి కమిషనర్ హామీ ఇచ్చారు.

ఈ పర్యటనలో ఎ.ఎమ్.ఓ.హెచ్. కిరణ్ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### సిద్ధరామయ్య సర్కార్‌కు ఉప ఎన్నిక సవాల్

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. అదే రోజు సాయంత్రం ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. ఎమ్మెల్యేల కోటాలో జరగాల్సిన ఎన్నికలు కావడం వల్ల అధికార కాంగ్రెస్ పార్టీకి ఈ మూడు స్థానాలను కూడా గెలుచుకోవడం నల్లేరు మీద నడకే అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమౌతోన్నాయి. ఈ ఎన్నికల్లో ఉప పోటీ చేయడానికి అభ్యర్థులను కొద్దిసేపటి కిందటే ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం. మాజీ ముఖ్యమంత్రి జగదీష్ షెట్టార్, కలబురగి జిల్లాకు చెందిన తిప్పన్నప్ప కమకన్నూర్, రాయచూర్ జిల్లాకు చెందిన ఎన్ఎస్ బోస్‌రాజు పేర్లను ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రస్తుతం బోస్‌రాజు.. సిద్ధరామయ్య కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారు. చిన్న నీటి పారుదల, జల వనరుల శాఖ మంత్రిగా వ్యవహరిస్తోన్నారు. ఇప్పటివరకు ఆయన అసెంబ్లీలో గానీ, శాసన మండలిలో గానీ సభ్యుడు కాదు. మంత్రి పదవిని స్వీకరించిన ఆరు నెలల వ్యవధిలోగా చట్టసభకు ఎన్నిక కావాల్సి ఉన్న నేపథ్యంలో- శాసన మండలి ఉప ఎన్నిక కోసం ఆయన పేరును పరిగణనలోకి తీసుకుంది కాంగ్రెస్.

## పంచాంగం

మంగళవారం 20-06-2023
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం గ్రీష్మరుతువు
ఆషాఢ మాసం

తిథి : శు. విదియ ఉ. 10.47
నక్షత్రం : పునర్వసు రా. 09.14
వర్జ్యం : ఉ. 08.10 ల 09.54

# అనాధ మహిళ కు సేవా స్ఫూర్తి మహిళలు సేవలు



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ పదో వార్డులో గల రవీంద్ర నగర్ సేవస్ఫూర్తి భవనం పక్కన నిరుపయోగంగా ఉన్న బస్టాప్‌లో కొద్దికాలంగా మతి స్తిమితములేని ఒక మహిళ ఉంటోంది. ఆ మహిళకు ప్రతిరోజు సేవాస్ఫూర్తి సభ్యులు కొంతమంది అల్పాహారన్ని, అన్న ప్రసాదాన్ని, మంచినీరును అందిస్తూ ఆమెకు ఆకలి తీరుస్తున్నారు. ఇటీవల ఆమహిళకు శుభ్రత లోపించి అంటూ రోగాల బారిన పడుతుంటే తక్షణమే సేవాస్ఫూర్తి సభ్యులు

స్పందించి స్థానిక మహిళలు మొల్లి అనిత,ఒమ్మి వేణు, ఒమ్మి భాగ్యలక్ష్మి , ఒమ్మి పార్వతి, మొల్లి శ్రీదేవి, మన్యాల అనూష, ఉప్పిలి వెంకటలక్ష్మి ఆ మతిస్థిమితం లేని మహిళకు స్నానం చేయించి దుస్తులను వేయించి ఆమెను అంటువ్యాధుల బారిన పడకుండా శుభ్రమైన స్థలంలో ఉంచారు.

కొద్ది రోజుల క్రితం ఒక అనాధ రోగికి ఇదే విధంగా చేసి మరణం అనంతరం అంత్యక్రియలు నిర్వహించినట్లు సేవా స్ఫూర్తి అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు తెలిపారు.

# విశాఖ శారదాపీఠాన్ని సందర్శించిన తాండూరు ఎమ్మెల్యే



తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సోమవారం విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించారు. రాజశ్యామల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. వచ్చే నెల 3వ తేదీన తాండూరులో తలపెడుతున్న రాజశ్యామల యాగం నిర్విఘ్నంగా సాగేలా దీవించాలని స్వరూపానందేంద్ర స్వామిని కోరారు. భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ కూడా విశాఖ శారదాపీఠాన్ని సందర్శించారు. 21వ తేదీన చాతుర్మాస్య దీక్ష కోసం స్వరూపానందేంద్ర స్వామి రిషికేష్ బయలుదేరుతున్న నేపథ్యంలో ఆయన నుంచి ఆశీస్సులు అందుకున్నారు.

# తిరుమల వెంకన్నను దర్శించుకున్న నగర మేయర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని సోమవారం నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకన్న స్వామి ఆశీస్సులతో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఆ స్వామి దీవెనలు దేశ ప్రజలపై ఉండాలని కోరుకుంటున్నానని, స్వామి దయతో జగనన్న ప్రభుత్వం ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు తోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందని, ఆయన ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

# విశాఖ సమాచారమ్

మంగళవారం 20-06-2023


## కైలాసం కావాలా? వైకుంఠం కావాలా?

ఓసారి భక్తతుకారామ్ భగవన్నామాన్ని ఉచ్చరిస్తూ, స్మరణ చేస్తూ వెళ్తున్నాడు.

అపుడు ఒకడు వచ్చేడు.

"నువ్వు ఈ నామాన్ని ఇలా స్మరిస్తున్నావ్ కదా? ఏమి కోరుకుంటున్నావ్. నీకు కైలాసం కావాలా? వైకుంఠం కావాలా? స్వర్గం కావాలా? " అని తుకారాంని అడిగేడు.

ఆ ప్రశ్నకి తుకారాం అంటాడు- "అయ్యా! నాకు కైలాసం, వైకుంఠం అంటే అర్థం కాదు. ఇక స్వర్గమంటారా? ఈ నామస్మరణ చేస్తున్నపుడు నేను అనుభవించేదే, అనుభవిస్తున్నదే 'స్వర్గం' అని బదులిస్తాడు.

భగవన్నామం హృదయంలో నినదిస్తే, నినాదాలు చేస్తే అదే స్వర్గం.

నామస్మరణ మనసు పడే ఆరాటాన్ని, ఆందోళనని, అశాంతిని అణచివేస్తుంది.

ఓ ఇనుప ముక్కను ఓ రాయిమీద రాస్తూ రాస్తూ పోతే వేడి పుడుతుంది.

భగవన్నామం అనే ఇనుప ముక్కతో, రాయిలాంటి మనసుని అటు ఇటు అనంతంగా, అఖండంగా రాస్తూ పోతే,' భక్తి' అనే వేడి పుడుతుంది.

పుట్టిన భక్తి అనే వేడి, పరమాత్మునికి ఉండే వెన్నలాంటి హృదయాన్ని కరిగిస్తుంది, కదిలిస్తుంది.

నారదుని ఉపదేశ కారణంగా రత్నాకరుడు రామనామాన్ని స్మరించిన కారణంగా శ్లోకదాతగా మారాడే.

వాల్మీకి మహర్షియై రామాయణ మహాకావ్యానికి సృష్టికర్తయ్యాడు.

అయితే నామస్మరణ, దైవచింతన అని రెండు ఉన్నాయి.

నామాన్ని జపించటం నామస్మరణ. ఆ నామం చేసిన లీలలను మహిమలను, మననం చేసుకోవటమే చింతన.

కృష్ణా కృష్ణా అని జపించటం స్మరణ. ఆ కృష్ణుడే ఎపుడో చేసిన లీలను మహిమలను మనం ఇపుడు మననం చేసుకోవటం చింతన.

నామాన్ని మనోభావంగా ఉచ్చరించాలి. పెదవులనుండి కాక హృదయంలోంచి ఉచ్చరించాలి.

ఆర్తితో ఉచ్చరించాలి.

అనుభవిస్తూ ఉచ్చరించాలి.

అనుభవంలోకి తెచ్చుకుంటూ ఉచ్చరించాలి.

మనసనే సరస్సులో నామం ఓ తామరపూవు.

తామరపూవులోని మకరందాన్ని త్రాగడానికి భక్తులు ఐహిక భావనలు వదిలి తుమ్మెదలవలె పరుగుతీయాలి.

హృదయపూర్వకంగా మనం ప్రార్థన చేస్తే భగవంతుడు మన పూజ గది ముందు దాసుడిగా వేచి ఉంటాడు...నిజమే కదా...

# పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ధర్నా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సోమవారం వామ పక్షాలు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. దీనిలో భాగంగా జగదాంబ జోన్ సెక్రెటరీ ఎం సుబ్బారావు అధ్యక్షతన గ్రీన్ పార్క్ హోటల్ ఏరియా లో ఉన్న విద్యుత్ కార్యాలయం ఎదురుగా లాంతరులతో వినోదంగా నిరసన తెలియజేయడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు సుబ్బారావు గారు మాట్లాడుతూ జగదాంబ జోన్ యొక్క ప్రజల యొక్క భావాల్ని తెలుసుకున్నానని ప్రతి ఒక్కరూ జగన్మోహన్ రెడ్డి పరిపాలన విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని గతంలో అతనికి ఓటు వేసి చాలా పెద్ద తప్పు చేశామని దాని ఫలితం ఈరోజు ప్రజలందరూ అనుభవిస్తున్నారని ఇటువంటి ప్రభుత్వం మరెప్పుడూ రాకూడదని ప్రజలు ప్రమాణం చేస్తున్నారని తెలియజేశారు అలాగే ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వై రాజు గారు మాట్లాడుతూ మోడీ గారి విధానాలను తూచా తప్పకుండా పాటిస్తూ దేశం మొత్తంలో ప్రజల పైన భారాలు వేయటంలో జగన్మోహన్ రెడ్డి దేశంలో ముందుకులో ఉన్నారని ఇటువంటి చేతకాని చావచచ్చిన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడు చూడలేదని ఇది జగన్మోహన్ రెడ్డికే అవమానం కాదని రాష్ట్ర ప్రజలందరూ సిగ్గుతో తల వంచుకొని వేరే రాష్ట్రాల ప్రజల ముందు బ్రతకవలసిన దీనస్థితి ఏర్పడిందని ఇటువంటి పరిస్థితి పునరావతం కాకుండా చూడవలసిన బాధ్యత ప్రజల మీద ఉందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వై రాజు గారి ఏర్పాటు చేసిన కరెంట్ బిల్ చూపర్ లను ఎంతగానో ఆకర్షించుకుంది ఈ కార్యక్రమానికి జగదాంబ జోన్ సిఐటియు నాయకులు చంద్రమౌళి డివైఎఫ్ఐ నాయకులు సంతోష్ కుమార్ గణేష్ కుమార్, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు కే నరసింహారావు గారు ముఠా కళాశీలు ఈ సందర్భంగా ప్రజలకు పెద్ద మొత్తంలో ప్రజలు పాల్గొన్నారు.

# నేటి నుండి జగన్నాథ రథయాత్ర ప్రారంభం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీ జగన్నాథ్ రథ యాత్ర మంగళవారం మధ్యాహ్నం 03:30 గంటల నుంచి సాయంత్రం 06:00 గంటల వరకు మరియు తేదీ 28:06:2023 న మధ్యాన్నం 03:30 గంటల నుంచి సాయంత్రం 06:00 గంటల వరకు సిరిపురం శ్రీ జగన్నాథ్ టెంపుల్ నుంచి బయలుదేరి గురజాడ కళా క్షేత్రం , తెన్నేటి పార్క్ రోడ్డు,సెక్టార్ 8 టెలిఫోన్ ఎక్స్చేంజి రోడ్డు,ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రోడ్డు, సెక్టార్ 11 షాపింగ్ కాంప్లెక్స్ రోడ్డు, టెలిఫోన్ టవర్ రోడ్డు, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ రోడ్డు, సెక్టార్ -9 గురజాడ కళా క్షేత్రం రోడ్డు, శ్రీ జగన్నాథ్ టెంపుల్ వద్ద సమాప్తం అవుతుంది.

తేదీ 21:06:2023 నుంచి 28:06 2023 తేదీ ల వరకు కల్చరల్ ప్రోగ్రామ్స్ టెంపుల్ వద్ద జరుగును.

## కుష్టువ్యాధి లేని జిల్లాగా రూపొందించడమే లక్ష్యం

### 26 నుంచి కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమం

**విజయనగరం:** జిల్లా నుంచి కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు కోసం జూన్ 26 నుంచి జూలై 16వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి ఎస్ చెప్పారు. జిల్లాలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యం కావాలన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి కుటుంబ సంక్షేమ కమిటీ సమావేశం కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లడుతూ కుష్టువ్యాధికి సంబంధించిన గుర్తించని కేసులు సమాజంలో వున్నందున ఈ వ్యాధి వ్యాప్తి పెరిగిందని, అందువల్ల ఈ వ్యాధి వ్యాప్తిని నియంత్రించే లక్ష్యంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

క్షేత్రస్థాయిలో మహిళల్లో ఈ కేసులను గుర్తించేందుకు ఆశ కార్యకర్తల సహకారాన్ని, పురుషుల్లో వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు గ్రామ, వార్డు వలంటీర్ల సహకారాన్ని తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీరాజ్, పురపాలక శాఖల అధికారులు తమ పరిధిలోని వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశ కార్యకర్త, పురుష వలంటీర్ ఒక బృందంగా ఏర్పడాలన్నారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.ఎస్.భాస్కరరావు, కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డా.ఎల్.సూర్యనారాయణ, డి.ఎస్.ఎం.ఓ. డా.జె.రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## జూలై నెల 20 నుడి ఆగష్టు 2 వరకు ర్యాలీ



**విజయనగర:** జూలై 20 నుండి జిల్లాలో నిర్వహించే ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి లైన్ డిపార్టుమెంటు అధికారులంతా తమ శాఖలకు అప్పగించిన ఏర్పాట్లను పకడ్బందీ గా చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రోజుకు కనీసం వెయ్యి మంది అభ్యర్థులు హాజరు అయ్యే అవకాశం ఉందని, పి.టి.సి లో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి వారి సూచనల మేరకు అవసరమగు ఏర్పాట్లను గావించాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ వినయ్ కుమార్ తో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ర్యాలీ కి అన్ని శాఖలు సమన్వయం తో పని చేయాలన్నారు. పి.టి.సి లో జరిగే ఈ ర్యాలీ కి అవసరమగు బారికాడింగ్ , రన్నింగ్ ట్రాక్ , రైన్ ప్రూఫ్ షెల్టర్స్ , షామియానాలు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పోలీస్ అధికారులకు, లైటింగ్, విద్యుత్ ఏర్పాట్లను చేయాలని, విద్యుత్ అధికారులకు , సిసి టి వి లను, ఐ.టి కు సంబంధించిన కార్యక్రమాలను డి.ఐ.ఓ చూడాలని సూచించారు. తాగు నీరు, స్నాక్స్, తాత్కాలిక మరుగుదొడ్లు , అందరికీ ఆహారం, అల్పాహారం చూడాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ కు ఆదేశించారు. అవసరం మేరకు వాహనాలను , బస్సు లను ఏర్పాటు చేయాలని జిల్లా రవాణా అధికరికి సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లో మాట్లాడగల ఉపాధ్యాయులను అనౌన్స్మెంట్ కోసం ఏర్పాటు చేయాలని డి.ఈ.ఓ కు సూచించారు. సెట్విజ్ సి.ఈ.ఓ అందరి అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమన్వయం చేసుకోవాలని అన్నారు. అధికారులంతా పి.టి.సి గ్రౌండ్స్ ను సందర్శించి అవసర్తమగు ఏర్పాట్లను ఆర్మీ అధికారులతో కూడా మాట్లాడుతూ చేపట్టాలన్నారు.

ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ వినయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం లో 13 జిల్లాలకు చెందిన నిరుద్యోగుల కోసం అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలి 2023-24 విజయనగరం జిల్లాలో నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ పరీక్ష రెండు దశలలో జరుగుతుందని, మొదటి దశ లో రాత పరీక్ష, ఇందులో ఉత్తీర్ణులైన వారికీ రెండవ దశ లో శారీరక సామర్థ్యం , వైద్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాత పరీక్ష ఇప్పటికే పూర్తి అయ్యిందని, 10 వేల మంది ఈ ఆన్లైన్ పరీక్ష లో ఎంపికైనారని, వీరికి శారీరక, వైద్య పరీక్షలు విజయనగరం పి.టి.సి గ్రౌండ్స్ లో జరుగుతుందని అన్నారు. ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ కి అవసరమగు గ్రౌండ్, భద్రత, ఫైర్ ఫిట్టింగ్ , ట్రాన్స్పోర్ట్, భోజనాలు, తాగు నీరు , సిసి కెమెరా లు, తదితర ఏర్పాట్లను, ఇతర లాజిస్టిక్స్ ను ఏర్పాటు చేయాలనీ కలెక్టర్ ను కోరారు.

ఈ సమావేశం లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డి.ఆర్.ఓ గణపతి రావు, సెట్విజ్ సి.ఈ.ఓ బి. రాంగోపాల్ , పి.టి.సి ప్రిన్సిపాల్ ఆదిబాబు, మున్సిపల్ కమీషనర్ శ్రీరాములు నాయుడు, డి.ఆర్.డి.ఎ పి.డి కళ్యాణ చక్రవర్తి, డి.ఎస్.పి శేషాద్రి, డి.ఈ.ఓ లింగేశ్వర రెడ్డి, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకట రమణ, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

# మా ఆకలి కేకలు వినండి! స్పందించండి!


**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, వేతనాలు పెంచాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివియంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టాం. గ్యాస్బండలు, వంటపాత్రలతో నిరసన చేసాం. జగన్మోహని సినిమాలోలాగా మా కాళ్ళను మేమే పొయ్యిలో పెట్టుకొని మా తీవ్ర బాధను వ్యక్తపరచాము.

జివియంసి, ఆనందపురం, భీమిలి మండలాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర నిర్వహిస్తోంది. ఈ సంస్థ ఉడకపెట్టిన గ్రుడ్లులు, అంబలి సరఫరా చేయటం లేదు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులే గ్రుడ్లులు ఉడకబెడుతున్నారు. అంబలి కాస్తున్నారు. ఒక గ్రుడ్డు ఉడకపెట్టినందుకు 10పైసలు గ్యాస్ నిమిత్తం ప్రభుత్వం చెల్లిస్తోంది, అంబలికి ఏమి చెల్లించటం లేదు. పాత్రలు ఇవ్వలేదు. గ్లాసులు, పాత్రలు, ప్లేట్లు శుభ్రం చేయడానికి కనీసం సబ్బులు, సర్ఫ్ ఇవ్వటం లేదు. 1100 విద్యార్థులు ఉన్న పాఠశాల్లో ఒక్క కార్మికురాలే పనిచేస్తోంది. మా శ్రమను చూసి కొంతమంది ప్రధాన ఉపాధ్యాయులు గ్యాస్ విడిపిస్తున్నారు, లేకపోతే లేదు. ఈ విధంగా మేము విపరితమైన పని భారాన్ని, ఆర్థిక దోపిడీని భరిస్తున్నాం. మాకు తక్షణం గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలి లేనిపక్షంలో మేము కేవలం అక్షయపాత్ర వారు తెచ్చేట భోజనం మాత్రమే వడ్డిస్తాము. మాకు వచ్చే 3,000/-రూ.లో 1200 రూ.లు గ్యాస్ విడిపించలేము. ఉదా : ఎన్ఎంసిహెచ్ హై స్కూల్లో 1100 మంది విద్యార్థులకు గ్రుడ్లు ఉడకబెట్టడానికి, అంబలి వండడానికి నెలకు 2 గ్యాస్ సిలెండర్లులు అవుతున్నాయి. అంటే 2,400/- రూ.లు మేము పెట్టుకోవలసి వస్తోంది. ఇంటి తీసుకువెళ్ళే జీతం 600/-రూ.లు అంటే రోజుకు 20/-రూ.లు జీతంగా వస్తోంది. గ్రుడ్ల ఉడకబెట్టి 10పైసలు డబ్బులు ప్రతీ నెలా ఇవ్వరు, జీతం ప్రతీ నెలా ఇవ్వరు. ఇంతకన్నా అన్యాయం మరొకటి ఉండదు.

మేము గడిచిన 15సం.రాలుగా పనిచేస్తున్నాం. మాకు కేవలం 3,000/-రూ.ల వేతనం చెల్లిస్తున్నారు. 50 ఇళ్ళకు సేవలందించే వాలంటీర్కి 5వేల రూ.ల వేతనం చెల్లిస్తున్నారు. శానిటరీ వర్కర్కి 6వేల రూ.ల వేతనం చెల్లిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి శానిటరీ వర్కర్స్ని నియమిస్తున్నారు. మేము మాత్రం విద్యార్థుల సంఖ్య ఎంత ఉన్నప్పటికీ ఒక్క కార్మికురాలు మాత్రమే ఉన్నాం. మేము చేస్తున్న పని దృష్టిలో పెట్టుకొని మా వేతనాలు పెంచాలని, విద్యార్థుల సంఖ్యను బట్టి మా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరుతున్నాం.

# సీనియర్ రాజకీయ నాయకులు కుందూరు జానారెడ్డి పుట్టినరోజు (జూన్ 20)

కుందూరు జానారెడ్డి ప్రముఖ రాజకీయ నాయకులు. వీరు నాగార్జునసాగర్ సమీపంలోని నల్గొండ జిల్లా అనుముల గ్రామంలో 20 జూన్ 1946 న జన్మించారు. జానారెడ్డి ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరి, తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1983లో చలకుర్తి నియోజకవర్గం నుండి తొలిసారిగా రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. అదే నియోజకవర్గం నుండి 6 పర్యాయాలు శాసనసభకు ఎన్నికై వ్యవసాయం, సహకార సంఘాలు, మార్కెటింగ్, అటవీశాఖ, పశు సంవర్ధక శాఖ, మత్స్య పరిశ్రమ, కొలతలు తూనికలు, రవాణా, రోడ్లు భవనాలు, గృహ, పంచాయతీరాజ్, గ్రామీణ, నీటి సదుపాయం



- శుభ్రత మొదలైన వివిధ మంత్రిత్వ శాఖలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా పని చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత దీర్ఘకాలం మంత్రిగా పని చేసిన వ్యక్తిగా కాసు బ్రహ్మానంద రెడ్డి నెలకొల్పిన రికార్డును అధిగమించి నిలిచారు. 1988 లో 30 మంది క్యాబినెట్ మంత్రులను బహిష్కరించడం పై ఎన్టీఆర్ పై విభేదించి టీడీపీ కి రాజీనామా చేసి ఒక రాజకీయ పార్టీ 'తెలుగు మహానాడు' స్థాపించారు.తరువాత ఆ పార్టీ, కాంగ్రెస్ పార్టీలో విలీనం అయ్యింది. వీరి భార్య పేరు సుమతి. ఈ దంపతులకు ఇరువురు సంతానం రఘువీర్ రెడ్డి, జై వీర్ రెడ్డి వీరి కుమారులు. వీరు 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గుండేబోయిన రామ్మూర్తి యాదవ్ చేతిలో ఓటమి చెందారు. 2009-2014 కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంచాయితీ రాజ్ మరియు గ్రామీణ నీటి సరఫరా మంత్రిగా పనిచేశారు. 2014 లో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతో శాసన సభకు జరిగిన ఎన్నికల్లో ప్రత్యర్థి టి ఆర్ ఎస్ అభ్యర్థి నోముల నరసింహులు పై విజయం సాధించి, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా పనిచేశారు. తెలంగాణ లో 2018 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వీరు నాగార్జున సాగర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి టి ఆర్ ఎస్ అభ్యర్థి నోముల నరసింహులు చేతిలో ఓటమి పాలైనారు. గెలుపు ఓటముల సమానంగా స్వీకరిస్తూ తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టు బడి ఉండే రాజకీయ వేత్త జానారెడ్డి.భవిష్యత్ రాజకీయాలలో తెలంగాణ ముఖ్యమంత్రి స్థానంలో జానారెడ్డి ఉండాలని ఆశిద్దాం...!

**డా. జె.వి.ప్రమోద్ కుమార్**
**పైడిమెట్ట 9490833108.**

# మధుమేహం నియంత్రణకు అద్భుత ఔషధం తులసి నీళ్లే



ఆయుర్వేదంలో, హిందూ ఆధ్యాత్మికతలో తులసి మొక్కకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. తులసి మొక్క ఆకులు, గింజలతో అద్భుత ప్రయోజనాలున్నాయి. తులసి ఆకుల నీళ్లతో మధుమేహాన్ని సైతం నియంత్రించవచ్చని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రస్తుత బిజీ ప్రపంచంలో మధుమేహం అనేది పెనుసవాలు విసురుతున్న సమస్యగా మారుతోంది. మధుమేహం నియంత్రణలో ఉంటేనే ఆరోగ్యపరంగా బాగుంటుంది. ఎందుకంటే బ్లడ్ షుగర్ అనేది చాలా ప్రమాదకరం. బ్లడ్ షుగర్ స్థాయి పెరిగేకొద్దీ డయాబెటిక్ పేషెంట్‌గా మారిపోతారు. అయితే ఆయుర్వేదంలో మధుమేహానికి మంచి ప్రత్యామ్నాయం ఉందంటున్నారు వైద్యులు. సరైన ఆహారపు అలవాట్లు, మెరుగైన జీవనశైలితో చాలావరకూ రోగాల్ని దూరం చేసుకోవచ్చు. అయితే చిన్న చిన్న విషయాల్ని దృష్టిలో పెట్టుకుంటే..బ్లడ్ షుగర్ స్థాయిని నియంత్రించవచ్చు. అయితే తులసి నీళ్లతో బ్లడ్ షుగర్ తగ్గించుకోవచ్చని చాలా తక్కువ మందికి తెలుసు. తులసి ఆకుల నీళ్లను మధుమేహం తగ్గించేందుకు ఎలా వాడాలనేది ఇప్పుడు తెలుసుకుందాం.

మధుమేహం నియంత్రణలో ఉండాలంటే ముఖ్యంగా కావల్సింది బ్లడ్ షుగర్ లెవెల్స్ తగ్గించుకోవాలి. ఓ గ్లాసు నీళ్లలో తులసి ఆకులు కొన్ని వేసి ఉడికించాలి. ఆ తరువాత ఆ నీటిని వడపోసి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం తాగాలి. ఇలా చేస్తే బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయంటున్నారు ఆయుర్వేద వైద్య నిపుణులు.

ఆయుర్వేద వైద్యశాస్త్రంలో తులసి నీళ్లతో చాలా ప్రయోజనాలున్నాయి. తులసి నీళ్ల జలుబు, దగ్గు తగ్గించేందుకు అద్భుతమైన ఔషధంగా ఉపయోపడతాయి. శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచేందుకు ఉపయోగపడుతుంది. ఆధునిక పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ఒత్తిడిని జయించేందుకు తులసి ఆకులు గానీ, తులసి నీళ్లు గానీ మీ డైట్‌లో భాగంగా చేసుకుంటే మంచి ఫలితాలుంటాయి. తులసి ఆకులతో టీ కూడా చేసుకుని తాగినా మంచి ఫలితాలుంటాయి.

# గ్యాస్ట్రిక్, బైపాస్ సర్జరీ తర్వాత ఆహార నియమాలు

గ్యాస్ట్రిక్, బైపాస్ సర్జరీ తర్వాత సహజంగా ఎటువంటి డైట్ పాటించాలని అనుకుంటే ఎలాంటి ఆలస్యం చేయకుండా దీన్ని పూర్తిగా చూసేయండి. డీహైడ్రేషన్ కు గురి అవకుండా ఉండాలంటే ప్రతి రోజు రెండు లీటర్ల వరకూ ఫ్లూయిడ్స్ తీసుకోవాలి. ఆహారాన్ని తీసుకునే సమయంలో మంచి నీటితో పాటు ఎలాంటి లిక్విడ్స్ కూడా తీసుకోకూడదు. కేవలం ఆహారాన్ని తీసుకున్న 30 నిమిషాల తర్వాత మాత్రమే మంచి నీళ్లు లేదా ఇతర లిక్విడ్స్ తీసుకోవాలి. ఇలా చేయడం చాలా అవసరం అని గుర్తుంచుకోండి. అంతే కాకుండా ఆహారం తీసుకునే 30 నిమిషాలు ముందు కూడా ఎలాంటి లిక్విడ్స్ తీసుకోకూడదు.

ఒకవేళ మంచి నీళ్ళను ఆహారం తీసుకునే సమయంలో తాగాలనుకుంటే చాలా నెమ్మదిగా సిప్ చేయాలి. ఎక్కువ మోతాదులో మంచి నీరును తీసుకోవడం వల్ల వాంతులు, వికారం, డయేరియా మరియు చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనబడతాయి.

ప్రతి రోజు ఆహారాన్ని బ్యాలెన్స్‌గా తీసుకోండి. ప్రోటీన్ ఉండే పదార్థాలను తప్పకుండా తీసుకోవాలి. ఎలాంటి ఆహార పదార్థాలలో అయితే ఎక్కువగా కొవ్వు పదార్థాలు, పంచదార ఉంటుందో వాటిని తీసుకోకపోవడమే మంచిది అని గుర్తుంచుకోండి.

ఆల్కహాల్ అస్సలు తీసుకోకూడదు. కెఫైన్ వీలైనంత వరకు తగ్గించండి, ఎందుకంటే కెఫైన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురి అవుతారు. విటమిన్, మినరల్స్ సప్లిమెంట్స్‌ను డాక్టర్ చెప్పిన విధంగా తప్పకుండా తీసుకోవాలి. అయితే ఆహారాన్ని తీసుకునేటప్పుడు ఎక్కువగా నమిలి తినాలి ఇలా చేయడం వల్ల డైజిషన్ ప్రక్రియ సులువుగా అవుతుందని గుర్తుంచుకోండి.

**లిక్విడ్స్** : సర్జరీ అయిన రోజు లేక తర్వాత రోజు కేవలం లిక్విడ్స్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు క్లియర్ లిక్విడ్స్ తీసుకోవాలని అనుకుంటే వీటిని తప్పకుండా తీసుకోండి. పంచదార కలపకుండా ఎలాంటి జ్యూస్ అయినా తీసుకోవచ్చు. కెఫైన్ లేనటువంటి టీ, కాఫీ, స్కిమ్డ్ మిల్క్, సూప్స్ వంటివి తీసుకోవాల్సి ఉంటుంది. ఇది స్టేజ్ వన్‌కు సంబంధించిన లిక్విడ్ ఫుడ్.

**ప్యూరీడ్ ఫుడ్స్** : వారం రోజుల వరకు లిక్విడ్స్ మాత్రమే తీసుకోమని డాక్టర్స్ సూచిస్తారు. కాకపోతే సర్జరీ చేసిన వారం తర్వాత మాత్రమే ప్యూరీడ్ ఫుడ్స్ తీసుకోవాల్సి ఉంటుంది అంటే వాటి కన్సిస్టెన్సీ అనేది స్మూత్ పేస్టులాగా, మెత్తగా ఉండాలి. ఈ విధంగా రోజుకు 3 నుండి 6 వరకు స్మాల్ మీల్స్‌గా తీసుకోవచ్చు. అయితే ఒక మీల్‌లో కేవలం నాలుగు నుండి ఆరు టేబుల్ స్పూన్ల ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని గమనించాలి.



ఇలా ప్యూరీడ్ ఫుడ్‌ని తీసుకుంటున్నా సరే ఆహారాన్ని చాలా నెమ్మదిగా తినాలి. అయితే ఈ విధమైన ప్యూరీడ్ ఫుడ్స్ తీసుకున్నప్పుడు ఎటువంటి సాలిడ్ పీసెస్ ఆహారంలో ఉండకుండా చూసుకోవాలి. దీనిలో భాగంగా క్రీమీ సూప్స్, గుడ్లు, కాటేజ్ చీజ్, గ్రౌండ్ మీట్ వంటి పదార్థాలతో పాటుగా ఒక లిక్విడ్‌తో బ్లెండ్ చేసుకుని తినొచ్చు. లిక్విడ్స్‌తో బ్లెండ్ చేయడానికి మంచి నీరు, స్కిమ్డ్ మిల్క్, జ్యూస్, సూప్ లాంటి లిక్విడ్స్‌ని ఉపయోగించవచ్చు.

**సాఫ్ట్ ఫుడ్** : ప్యూరీడ్ ఫుడ్స్‌ను కొన్ని వారాల పాటు తీసుకున్న తరువాత సాఫ్ట్ ఫుడ్స్‌ను మీరు డైట్‌లో భాగంగా తీసుకోవచ్చు. కానీ మీరు తీసుకునే ఆహారం చాలా మెత్తగా మరియు తాజాగా ఉంటేనే ఎంపిక చేసుకోండి. రోజుకు మూడు నుండి ఐదు స్మాల్ మీల్స్‌గా తీసుకోవాలి. సాఫ్ట్ ఫుడ్స్‌లో భాగంగా పొట్టు తీసి ఉడికించిన కూరగాయలు, అన్నం, గుడ్లు, ఫిష్, లీన్ మీట్ వంటి మొదలైన ఆహార పదార్థాలను తీసుకోవచ్చు.

**సాలిడ్ ఫుడ్** : గ్యాస్ట్రిక్ బైపాస్ డైట్‌లో భాగంగా 8 వారాల తర్వాత సాలిడ్ ఫుడ్స్‌ను తీసుకోవచ్చు. సాలిడ్ ఫుడ్స్‌ని తీసుకున్నప్పుడు కొన్ని ఆహార పదార్థాలు నొప్పి, వికారం, వాంతులు వంటి వాటికి గురి చేస్తాయి. కాబట్టి వాటిని తీసుకున్నప్పుడు మీరు ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొంటే కొన్ని మార్పులు చేసుకోండి. సాలిడ్ ఫుడ్స్ లో భాగంగా బ్రెడ్, కార్బొనేటెడ్ డ్రింక్స్, పచ్చి కూరగాయలు, ఉడికించిన కూరగాయలు, ఫ్రైడ్ ఫుడ్స్, పాప్ కార్న్ వంటి ఇతర స్పైసీ ఫుడ్స్ కూడా తీసుకోవచ్చు.

ఈ విధంగా గ్యాస్ట్రిక్ బైపాస్ డైట్ ని పాటించడం వల్ల సర్జరీ నుంచి త్వరగా రికవరీ అవుతారు. అంతేకాకుండా మీ ఆరోగ్యంతో పాటు బరువు కూడా పర్ఫెక్ట్‌గా ఉంటుంది. సర్జరీ తరువాత అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు వలన ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పైగా మోతాదుకు మించి ఆహారాన్ని తీసుకోవడం వలన ఎన్నో రకాల కాంప్లికేషన్స్‌ను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని గుర్తుంచుకోండి. కాబట్టి ఇలాంటి మార్పులను మీ డైట్ లో చేసుకొని సర్జరీ నుండి వీలైనంత త్వరగా రికవరీ అవ్వండి.

# జ్ఞాపకశక్తికి అద్భుతమైన దివ్యౌషధం ఇదే



సాధారణంగా పాలను సూపర్ ఫుడ్‌గా పిలుస్తారు. అదే పాలలో కొద్దిగా ఎండు ద్రాక్ష మిక్స్ చేస్తే..ఇక దివ్యౌషధమే. ఆహారపు అలవాట్లు, జీవనశైలి ఆధారంగా ఆరోగ్య స్థితి ఉంటుంది. ఆహారపు అలవాట్లు బాగుంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. లేకుంటే అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. మెరుగైన ఆరోగ్యం కోసం డైట్‌లో పాలు, ఎండుద్రాక్ష చేర్చుకుంటే చాలని..అద్భుత ప్రయోజనాలు కలుగుతాయంటున్నారు వైద్య నిపుణులు.

ఎండుద్రాక్ష, పాలు. రెండూ ఆరోగ్యానికి చాలా మంచివి. రెండింట్లోనూ పోషక పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి. ఎండుద్రాక్షలో హెల్తీ ఫ్యాట్స్, ఫైబర్, కాపర్, ఐరన్, కాల్షియం, పొటాషియం పుష్కలంగా ఉంటే..పాలలో కాల్షియం, ప్రోటీన్లు, విటమిన్ డి అత్యధికంగా ఉంటాయి. అందుకే ఈ రెండూ కలిపి ప్రతిరోజూ తాగితే శరీరంలో పోషక పదార్థాల లేమి తలెత్తదు. ఫలితంగా గంభీరమైన రోగాలు దూరమౌతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

**జ్ఞాపక శక్తి** : రోజూ క్రమం తప్పకుండా పాలు, ఎండుద్రాక్ష కలిపి తీసుకోవడం వల్ల ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యల్ని జయించవచ్చు. ముఖ్యంగా మెమెరీ పెరుగుతుంది. మెదడు పనితీరు అద్భుతంగా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే బుద్ధి వికసితమౌతుంది. రాత్రి పడుకునేముందు పాలలో ఎండుద్రాక్ష కలిపి తాగడం వల్ల సుఖమైన నిద్ర పడుతుంది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి ఇదొక మంచి ఔషధం కాగలదు. త్వరగా పడుకునేందుకు కూడా దోహదమౌతుంది.

**ఎముకలు పటిష్టం** : పాలు, ఎండుద్రాక్ష రెండింట్లోనూ కాల్షియం పుష్కలంగా ఉంటున్నందున..ఈ రెండు కలిపి తీసుకోవడం ద్వారా ఎముకలకు బలం చేకూరుతుంది. ఎండుద్రాక్షలో ఉండే బోరాన్ అనే కెమికల్ ఎముకలకు చాలా లాభదాయకం. అటు కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. ఫ్రాక్చర్ కారణంగా ఏర్పడే గాయాలు తగ్గుతాయి. ఇతర చాలా గంభీరమైన రోగాలకు పాలు-ఎండుద్రాక్ష మిశ్రమం అద్భుతంగా పనిచేస్తుంది.

ఎండుద్రాక్షలో జీర్ణానికి తోడ్పడే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపర్చడమే కాకుండా మెటబోలిజంను వృద్ధి చేస్తుంది. శరీరంలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. కోలన్ పనితీరు మెరుగుపడుతుంది. శరీరాన్ని ఎప్పటికప్పుడు డీటాక్స్‌పై చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటాము.

# ఉల్లిపాయలతో మధుమేహం నియంత్రణ



కొన్నేళ్లుగా మారిన జీవన శైలి, ఆహార అలవాట్లు, కాలుష్యం వంటి వాటి వల్ల మధుమేహం బాధితులు పెరిగిపోతున్నారు. ఒక్కసారి మధుమేహం బారిన పడితే జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అయితే కొన్ని రకాల ఆహార పదార్థాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మన రక్తంలో చక్కెర స్థాయిలను, రక్త పోటును నియంత్రించడంలో తోడ్పుతాయి. అలా ఉల్లిపాయలు మధుమేహం నియంత్రణకు తోడ్పడుతాయని తాజాగా శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో గుర్తించారు.

ఎండోక్రైన్ సొసైటీ సమావేశంలో.. అమెరికాలోని శాన్ డియాగోలో ఇటీవల జరిగిన 97వ ది ఎండోక్రైన్ సొసైటీ వార్షిక సమావేశంలో శాస్త్రవేత్తలు ఉల్లిపాయలు, మధుమేహంపై చేసిన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఉల్లిలోని 'అల్లియమ్ సెపా' అనే పదార్థం మన రక్తంలో చక్కెర స్థాయిలు 50 శాతం వరకు తగ్గించేందుకు తోడ్పడుతున్నట్టు తాము గుర్తించినట్టు వెల్లడించారు. అంతేగాకుండా శరీరంలో కొలెస్ట్రాల్ ను నియంత్రణలో ఉంచడంలోనూ పనిచేస్తున్నట్టు తెలిపారు.

ఎలుకలపై పరిశోధన చేసి..

ఈ అంశానికి సంబంధించి ఎలుకలపై పరిశోధన చేశామని శాస్త్రవేత్తలు వివరించారు. మొత్తం నాలుగు గ్రూపులుగా ఎలుకలను తీసుకున్నామని.. అందులో ఒక గ్రూపు మధుమేహం లేని ఎలుకలు అని చెప్పారు. మధుమేహం ఉన్న మూడు గ్రూపుల్లోని ఎలుకలకు.. ఉల్లి నుంచి తీసిన పదార్థాలను వేర్వేరు డోసుల్లో అందించి పరిశీలించామని తెలిపారు.

మధుమేహం ఉన్న మూడు గ్రూపుల్లోని ఎలుకల్లో.. 'అల్లియమ్ సెపా' డోసు ఎక్కువగా ఇచ్చిన గ్రూపులో రక్తంలో చక్కెర స్థాయిలు బాగా నియంత్రణలో ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. అదే సమయంలో వాటిలో కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గాయని వివరించారు.

ఉల్లిపాయలు తీసుకోవడం వల్ల మరో లాభం కూడా ఉందని.. వాటి వల్ల పెద్దగా కెలోరీలు కూడా అందకపోవడం వల్ల అంతిమంగా శరీరంలో గ్లూకోజ్ శాతం పెరిగే పరిస్థితి కూడా ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికి సంబంధించి మనుషులపైనా ప్రయోగాలు చేయాల్సి ఉందని వివరించారు.

# ఖాళీ కడుపుతో ఉదయాన్నే దానిమ్మ జ్యూస్ తాగితే



ఆరోగ్యకరమైన శరీరం పొందడానికి, ఖచ్చితంగా ఆహారంలో పండ్లు, వాటి రసాన్ని చేర్చుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. ఇలాంటి వాటిలో దానిమ్మ పండు ఎంతో ఉత్తమంగా పని చేస్తుంది. రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని రుజువు చేస్తుంది. అయితే ఉదయాన్నే ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల అనేక వ్యాధులు నయం అవుతాయని మీకు తెలుసా. ఉదయాన్నే పరగడుపున దానిమ్మ రసం తాగితే రోజంతా శరీరంలో శక్తి ఉంటుంది. శరీరంలో రక్తం లేకపోవడం తొలగిపోయి హిమోగ్లోబిన్ పెరుగుతుంది. విటమిన్ కె, విటమిన్ బి, విటమిన్ ఎ, విటమిన్ డి, కాల్షియం, పొటాషియం, జింక్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్, ప్రొటీన్లు కూడా దానిమ్మ రసంలో ఉన్నాయి.

1- రక్తహీనత దూరం- మీ శరీరంలో ఐరన్ లోపం ఉంటే.. మీరు రక్తహీనతకు గురైనట్లయితే, మీరు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. రోజూ ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల శరీరానికి తగినంత ఐరన్ అందుతుంది. దీని కారణంగా, శరీరంలో ఎర్ర రక్త కణాలు పెరుగుతాయి. రక్తహీనత ఫిర్యాదు అనే సమస్య ఇకపై రాదు.

2- రోగనిరోధక శక్తిని పెంచండి- ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. దానిమ్మ రసంలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఐరన్ పుష్కలంగా ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. శరీరాన్ని వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతుంది.

3- ముఖం మెరిసిపోతుంది- దానిమ్మ రసం చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల చర్మం మెరుస్తుంది. దానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా, మెరిసేలా చేస్తాయి.

4- గర్భిణీ స్త్రీలకు ప్రయోజనకరమైనది- గర్భధారణ సమయంలో, మహిళల శరీరంలో విటమిన్లు, ఇనుము లేకపోవడం తరచుగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. దీని కారణంగా, శరీరంలో విటమిన్లు, ఐరన్ లోపం నెరవేరుతుంది. శరీరంలో రక్తానికి కొరత ఉండదు. శక్తి కూడా లభిస్తుంది.

5- గుండెకు మేలు చేస్తుంది- రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మలో కొలెస్ట్రాల్‌ని తగ్గించే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా దానిమ్మ రసం ఖాళీ కడుపుతో తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది.

6- రక్తపోటు నియంత్రణ- దానిమ్మపండులో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. అధిక రక్తపోటు ఉన్నవారు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

# కరివేపాకుతో జుట్టుకు అనేక లాభాలు

కరివేపాకు.. దీనికి కొన్ని ప్రాంతాల్లో కళ్యామాకు అని కూడా అంటారు. చెట్టు సుగంధభరితమైన ఆకులు గల ఒక అందమైన పొద మొక్క లేదా చిన్న చెట్టు. దీని ఆకులని కరివేపాకు అంటారు. మీ అందరికీ బాగా పరిచయం ఉంటుంది. మసాలా దినుసులు, మీ కూరగాయలను రుచిగా మార్చడంలో దీని పాత్ర అధికంగా ఉంటుంది. ఇది ఎక్కువగా ఇండియా, శ్రీలంకలలో కనిపిస్తుంది. కూర, చారు, పులుసు, వగైరా వంటకాలలో సువాసనకోసం వాడుతారు. అంతేకాదు కరివేపాకు వంటలను రుచికరంగా మార్చడంలో మాత్రమే కాకుండా మీ అందాన్ని మరింత మెరుగులు దిద్దడంలో కూడా సహాయ పడుతాయి. వాస్తవానికి, కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. దీనితో పాటు కరివేపాకులో బి విటమిన్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇవి హెయిర్ ఫోలికల్స్‌లో మెలనిన్ ఉత్పత్తి చేయడానికి పని చేస్తాయి. దీంతో జుట్టు నల్లగా, తెల్లజుట్టు సమస్య దూరమవుతుంది. కనుక ఇది కొంత ప్రభావం చూపుతుంది.

జుట్టు కోసం కరివేపాకుతో ప్రయోజనాలు

కరివేపాకు కూడా జుట్టు తెల్లబడకుండా కాపాడుతుంది. వాస్తవానికి, కరివేపాకు మెలనిన్ ఉత్పత్తి చేయడానికి పని చేస్తుంది. మెలనిన్ లోపం వల్ల జుట్టు తెల్లగా మారుతుంది. ఇలాంటి సమయంలో కరివేపాకుతో చేసిన హెయిర్ మాస్క్‌ని



జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు నెరిసే సమస్య దూరం అవుతుంది. దీనితో పాటు, జుట్టు కూడా మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది.

కరివేపాకు హెయిర్ మాస్క్ ఎలా తయారు చేయాలి

గ్యాస్ మీద పాన్లో, 2 టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెను వేడి చేయండి.

ఇప్పుడు దానికి 10-12 కరివేపాకు వేసి 3-4 నిమిషాలు ఉడికించాలి. అప్పుడు గ్యాస్ ఆఫ్ చేయండి.

ఇప్పుడు 20 నిమిషాలు చల్లబరచడానికి పక్కన పెట్టండి. మీ కరివేపాకు హెయిర్ మాస్క్ సిద్ధంగా ఉంది.

కరివేపాకు హెయిర్ మాస్క్ ఎలా అప్లై చేయాలి

జుట్టు మీద కరివేపాకు మాస్క్ అప్లై చేయడానికి, రెండు చేతులతో మొత్తం జుట్టు మీద అప్లై చేయండి. ముందుగా ఈ మాస్క్‌తో హెయిర్ రూట్‌లను మసాజ్ చేసి, తర్వాత జుట్టు మొత్తానికి బాగా అప్లై చేయండి. ఒక గంట తర్వాత, ఇప్పుడు జుట్టును బాగా కడగాలి. మీ జుట్టు చాలా మృదువుగా.. మెరిసేలా మారడం మీరు చూస్తారు.

కరివేపాకు, పెరుగుతో కూడా హెయిర్ మాస్క్ తయారు చేసుకోవచ్చు

మీరు కరివేపాకు, పెరుగుతో హెయిర్ మాస్క్‌ని కూడా తయారు చేసుకోవచ్చు. ఈ మాస్క్ చుండ్రును తొలగించడంలో కూడా సహాయపడుతుంది. దీని కోసం, ఒక గిన్నె పెరుగులో 3-4 కరివేపాకులను పేస్ట్ అయ్యే వరకు కలపండి. తర్వాత జుట్టుకు బాగా పట్టించాలి. ఇది మీ జుట్టుకు చాలా మేలు చేస్తుంది.

# అర్హత ఉన్న వారందరికీ ఇళ్లు మంజూరు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అర్హత ఉన్న వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో సర్పంచ్ పసుపులేటి లక్ష్మీరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. ప్రభుత్వ నుంచి వివిధ పథకాలు అందుకున్న లబ్ధిదారులకు మంత్రి అమర్నాథ్ లబ్ధి పత్రాలను అందజేశారు. స్థానికులు కాలువలు, మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఈ గ్రామంలో పలుచోట్ల కాలువల నిర్మాణానికి 15 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. అలాగే అంగన్వాడీ భవనానికి వెళ్లిన మంత్రి అమర్నాథ్, అతి చిన్న స్థలంలో అంతంతమాత్రంగా ఉన్న భవనాన్ని చూసి శాశ్వత భవనాన్ని నిర్మించాలని భావించారు. వెంటనే ఎమ్మార్వో ను పిలిపించి అంగన్వాడీ భవనానికి ఐదు సెంట్లు స్థలం మంజూరు చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధులు కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి అమర్నాథ్ చెప్పారు. అదే విధంగా సచివాలయం ప్రాంతంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి కూడా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ పర్యటనలో కొంతమంది దోబీలు మంత్రి అమర్నాథ్ వద్దకు వచ్చి తమకు దోబీకాన నిర్మించాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన ఇందుకోసం ఐదు లక్షల రూపాయలు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు.

ఇదిలా ఉండగా ఈ గ్రామాల్లోని అడ్డూరి చిన్నప్పరావు చాలాకాలంగా పరాలసిస్ తో బాధపడుతున్నాడు. గడప గడపగడపకు వెళు తున్న మంత్రి అమర్నాథ్, అప్పారావును చూసి అతని ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. చాలాకాలంగా అస్వస్థతతో ఉన్న తనకు ఆర్థిక సహాయం అందించాలని మంత్రిని కోరగా ఇప్పటివరకు వైద్యానికి ఆయన ఖర్చుల వివరాలను తనకు అందజేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహకారం అందిస్తానని చెప్పారు. కాగా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ తో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి అమర్నాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా గ్రామంలో కోతులు బెడద ఎక్కువగా ఉందని దాన్ని నివారించే మార్గం చూపాలని మంత్రి అమర్నాథ్ స్థానికులు కోరారు. సంబంధిత అధికారులకుదీనికి సంబంధించి ఆదేశాలు ఇస్తామనిమంత్రి చెప్పారు. ఈసందర్భంగా మంత్రి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి అక్కడున్న సౌకర్యాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ గ్రామాలలో సూక్ష్మస్థాయి సమస్యలను కూడా పరిష్కారానికిపరిష్కారానికి ముఖ్యమంత్రి ఆదేశించారని అందుకు అనుగుణంగా చర్య లు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలోనే ప్రతి ఇంటికి వెళ్లిఅర్హత ఉండి ప్రభుత్వ



పథకాలు అందని వారికి కూడా అవి అందేలా చూస్తామని చెప్పారు. గత ఎన్నికల్లో జగన్మో హన్ రెడ్డిని గెలిపించిన ప్రజలకు వీలైనంత వరకు ఎక్కువ మేలు చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందని చెప్పారు. శంకరం గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని, గ్రామంలో కొన్నిచోట్ల స్థానికులు సహకరిస్తే రోడ్ల నిర్మాణం కూడా చేపడతామని అని చెప్పారు. గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని మంత్రి అమర్నాథ్ స్థానికులను కోరారు. అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో స్పందనకు 232 వినతులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): కలెక్టరేట్ లోని స్పందన హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి సోమవారం 232 వినతులను జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి , జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ స్వీకరించారు. విఆర్ఓ వెంకటరమణ వృద్ధులు వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైనా జిల్లా అధికారులు ప్రజల సమస్యలను తొందరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని, పదేపదే సమస్యలపై ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్ అన్నారు

## దంత సంరక్షణ పట్ల అవగాహన కార్యక్రమం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): దంత సంరక్షణ కోసం కాల్షియం హెచ్చుగా ఉండే పాలు, పెరుగు పన్నీరు వంటి పదార్థాలను తీసుకోవాలని దంత వైద్యులు పండూరి సిహెచ్ గణేష్ అన్నారు. స్థానిక జార్జ్ క్లబ్ సమావేశ హాల్లో అనకాపల్లి వాకర్స్ క్లబ్ ఆదివారం వాకర్స్ సభ్యుల కోసం దంత సమస్యలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నల్లల దేవుళ్ళు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గణేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల దంత సంరక్షణ పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పిజ్జా బర్గర్లు వంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలని, హార్డు బ్రష్లు వినియోగించకుండా సాఫ్ట్ బ్రెష్ లను ఉపయోగించాలన్నారు. సందర్భంగా వాకర్స్ అడిగిన ప్రశ్నలకు డాక్టర్ గణేష్ వాకర్స్ అనుమానాలను నివృత్తి చేశారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి భీ శెట్టి రామకృష్ణ , డాక్టర్ డి డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25న జిల్లాస్థాయి యోగా పోటీలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఈనెల 25న జిల్లాస్థాయిలో యోగాసనంల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక రింగ్రోడ్డులో ఉన్న రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ యోగ సెంటర్ కోఆర్డినేటర్ జి మంగయ్య, నిర్వా హకులు కోలపర్తి జయ బాబు తెలిపారు. యోగ పోటీల్లో 8 ఏళ్ల వయస్సు బాలబాలికల నుండి 30 ఏళ్ల వయ స్సున్న బాలి బాలికలు, అలాగే 30 ఏళ్ల నుండి 60 సంవత్సరాల పైబడిన వారు కూడా ఈ పోటీల్లో పాల్గొన్న వచ్చున్నారు. ఈ పోటీలు వివిధ కేటగిరీలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు వంద రూపాయలు ప్రవేశము చెల్లించి పాల్గొనాలని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ జి మంగయ్య మాట్లాడుతూ యోగాభ్యాసం ధ్యానం చేయడం వలన మానసిక ప్రశాంతత కలుగుతుందని, విద్యార్థులలో ఉండే ఫోబియా పోతుందని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం, ధ్యానం, యోగా అభ్యాసం ప్రతి ఒక్కరు చేయాలని ఆయన అన్నారు. సంవత్సరం క్రితం కేవలం 15 మందితో అనకాపల్లిలో ఈ ఉచిత ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించామని కోలపర్తి జయ బాబు ఉచితంగా ఈ కేంద్రం నిర్వహిం చేందుకు భవనాన్ని ఇచ్చారన్నారు. 15 మందితో ప్రారంభమైన ఈ కేంద్రంలో ప్రస్తుతం 200 పైగా సభ్యులు యోగాభ్యాసం ధ్యానాన్ని అభ్యసిస్తున్నారు అన్నారు. సికింద్రాబాద్ లోనున్న శాంతివనం లో కమలేష్ డి పటేల్ దాజీ నేతృత్వంలో ఈ హార్ట్ ఫుల్ నెస్ ఉచిత ధ్యాన యోగ సెంటర్ నిర్వహించబడుతుందని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కనహ శాంతి వనంలో లక్ష మంది యోగసాధకులతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 175 దేశాల్లో ఈ హార్ట్ ఫుల్ నెస్ ఉచిత ధ్యానం కేంద్రాలు ఉన్నాయన్నారు. కోలపర్తి జయ బాబు ఉచితంగా భవనం ఇవ్వడంతోపాటు యోగా, ధ్యానం చేస్తూ తమ సంస్థను ప్రోత్సహించడం కాకుండా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇటీవల పేదలకు వెయ్యి గొడుగులు పంపిణీ చేశారన్నారు. అంతేకాకుండా పేదలకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా జయ బాబు సహృదయానికి సంస్థ కోఆర్డినేటర్ మంగయ్య ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా లక్ష్మీ గణపతి హెూమం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి గవరపాలెం శతకంపట్టు వద్ద వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ ఆలయ 6 వార్షికోత్సవ సందర్భంగా ఆలయం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు భోగపురపు వెంకటరమణ (బాబు) పర్యవేక్షణలో నిర్వహించనున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి కళ్యాణం మహెూత్సవ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ వద్ద లక్ష్మీ గణపతి హెూమం నిర్వహించారు, ఈ హెూమంలో నాయుడు, యుగంధర్, పూర్ణ, అబ్బులు దంపతులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయచైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ నిర్వాహకులు కాంద్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసిన అక్క రమాని



అరిలోవ, (విశాఖ సమాచారమ్): జీవీఎంసీ 12వ వార్డులో ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల , 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణిరామన్ పాల్గొన్నారు. అనంతరం దివిస్ కంపెనీ సహాయార్థం పంపిణీ చేసిన మంచి నీటి ఫిల్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వైఎస్సార్సీపీ నాయకులు సత్తి మందా రెడ్డి, పి. బాలరాజు, ముద్దాడ పాపారావు, హుస్సేన్, గుజ్జారి మురళి, ఈగల బుజ్జి, బందం శ్రీను, సూర్యా రావు, మోహన్, రొంగలి శ్రీను, రమణ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలలో సత్వరమే మౌలిక సదుపాయాలు కల్పన



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోరాష్ట్రంలోని అనేక గ్రామాలు, కాలనీలనుపూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని మిగిలిన ప్రాంతాలను కూడా తీర్చిదిద్దడానికి నిధుల కొరత లేదని అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామనిరాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడించారు. సత్యనారాయణపురం సచివాలయ పరిధిలోని సుబ్రహ్మణ్య కాలనీ, డీబీ కాలనీలలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంజరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్నాథ్ లబ్ధిదారులకు లబ్ధిపత్రాలు అందజేశారు. ఈ కాలనీలలో తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని స్థానికులు మంత్రిని కోరారు. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి సత్వరమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సుబ్రమణ్యం కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగనీటి సౌకర్యాలను కల్పించాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇళ్ల పట్టాల మంజూరును కూడా వేగవంతం చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ తను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియోజకవర్గం లోని చాలా వరకు ప్రాంతాలను అభివృద్ధి చేశామని, మిగిలిన సమస్యలను పరిష్కరించటంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నానని చెప్పారు. గడపగడపలో మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరి స్తున్నానని, అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంలో జాప్యం జరగ కూడదని మంత్రి అమర్నాథ్ ఆదేశిం చారు. ఇదిలా ఉండగా సుమారు 25 లక్షల రూపాయలతో ఈ ప్రాంతంలో నిర్మించినఅంతర్గత రహదారులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు వైసిపి నాయకులు కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ జగన్నాథుని రథోత్సవం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి గవరపాలెం అగ్గి మర్రి చెట్టు వీధిలో వేంచేసి ఉన్న సుభద్ర బలబద్ర సమేత జగన్నాథ స్వామి వారి రథయాత్ర మహెూత్సవం ఈనెల 20 నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ తెలిపారు. 19 తేదీ సోమవారం రాత్రి ఆలయ మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి కళ్యాణం మహెూత్సవం అత్యంత వైభవంగా జరుగును, 20వ తేదీ మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం రథయాత్ర ప్రారంభం అవుతుంది . జగన్నాథ రథోత్సవం గవరపాలెం పెరుగు బజార్ , గాంధీ బొమ్మ జంక్షన్, మల్ల వీధి మీదగా గూడ్స్ రోడ్డు వద్ద ఉన్న ఇంద్రజ్యుమ్న మందిరానికి చేరుకుంటుంది. ఈనెల 21 బుధవారం నుండి ప్రతిరోజు స్వామివారు దశావతారాల అలంకరణతో ఈ నెల 29 వరకు శ్రీ స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారని, ప్రతిరోజు స్వామివారికి సుప్రభాత సేవ అర్చనలు నిర్వహించబడతాయన్నారు. ఈనెల 29 ఆఖరి రోజు భారీ అన్న సమారాధన అనంతరం తిరిగి రథయాత్ర ప్రారంభమవుతుందని ఆయన తెలియజేశారు. నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, ఇంద్రద్యుమ్న హాలు వద్ద భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూ లైన్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఉక్కు పరిశ్రమను కాపాడుకోడానికి నడుస్తున్న ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మారుస్తా



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ ఉక్కు ఆంధ్ర రాష్ట్రంలోనే ఉన్న ఏకైక భారీ పరిశ్రమని, దీనిని కాపాడుకుంటానికి నడుస్తున్న ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి పోరాటాన్ని తీవ్రతరం చేస్తాం అని అఖిలపక్ష రాజకీయ పార్టీలు రైతు, కార్మిక, ప్రజా సంఘాలు గుంటూరు జిల్లాబీ గుంటూరు CPI పార్టీ భవన్ లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో పనిచేసే వేలాదిమంది కార్మికులతో పాటు పరోక్షంగా లబ్ధి పొందుతున్న లక్షలాదిమంది కార్మికులు రాష్ట్రంలోని యువజన, విద్యార్థి, కార్మిక, రైతు, అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచి పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకుంటామని పోరాట కమిటీ తరపున విశాఖ ఉక్కు నుండి కార్మిక సంఘం నేతలతో కలిసి సమావేశానికి హాజరైన AITUC అదనపు ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జె.రామక్రిష్ణ. తన ప్రసంగంలో తెలిపారు.

## 48వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కె.కె రాజు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ ఉత్తర నియోజకవర్గం 48 వార్డులో 1కోటి 7లక్షల 70వేలు రూపాయల వ్యయంతో న్యూ శ్రీనివాస నగర్, శివలింగపురం, ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్,సీసీ రోడ్లు,మెట్లు,డ్రైన్లు నిర్మాణంకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం 48వార్డు ఇంచార్జ్ నీలి రవి ఆధ్వర్యంలో శివలింగపురంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు పాల్గొని కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, DE భరణి కుమార్, అర్చన,48వార్డు నాయకులు కర్రి రామారెడ్డి,వసంతల అప్పారావు, రుత్తల రాంబాబు,జాగరపు అప్పారావు, రాజాన రామునాయుడు, నరేశ్, లాలం పార్వతి,డొప్ప శ్రీను,ఉమా, భాను, శ్రీను, నాగేశ్వరరావు,నాయుడు మాస్టర్, ప్రశాంత్, సచివాలయం సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

# మండలాల్లో శాఖల సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలి



**విజయనగరం:** పలు శాఖల సమన్వయంతో పరిష్కరించాల్సిన వినతులపై తగిన చర్యలు చేపట్టేందుకు ప్రతి సోమవారం మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమావేశమై ఆయా వినతుల పరిష్కారంపై చర్చించాలని, సమిష్టిగా వాటికి సంతృప్తికర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో ఆయా శాఖల ద్వారా సంతృప్తికరమైన రీతిలో పరిష్కారం కాని వినతులపై జిల్లా అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. పౌరసరఫరాలు, విద్యుత్ పంపిణీ సంస్థ, గృహనిర్మాణ సంస్థ, విద్యాశాఖ, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, జిల్లా పంచాయతీరాజ్ విభాగం, పోలీసు, రోడ్లు భవనాలు తదితర శాఖల ద్వారా రీ ఓపెన్ అయిన వినతులపై సమీక్షించారు. జిల్లా అధికారులు తమ పరిధిలో అందిన వినతుల పరిష్కారంపై ప్రతిరోజూ అవి ఏస్థాయిలో పరిష్కార దశలో వున్నదీ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు ఆయా వినతుల పరిష్కారంపై తుది నిర్ణయం తీసుకొని పరిశీలించిన తర్వాతే వాటిని ఆన్ లైన్‌లో నమోదు చేయాలని స్పష్టంచేశారు. సివిల్, భూతగాదాలు, కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి వివాదాలు వంటి అంశాల్లో రెవిన్యూ, పోలీసు అధికారులు ఉమ్మడిగా చర్చించి వాటి పరిష్కారంపై ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. తమకు సంబంధంలేని వినతులు అందినట్లయితే వెంటనే సంబంధిత శాఖకు ఆ వినతిపై సమాచారం ఇవ్వాలని తమకు పట్టనట్టుగా వుండొద్దని చెప్పారు. అధికారులు తమకు వచ్చిన వినతిని అదే రోజు తెరచి చూసి దానిని పరిష్కారంకోసం తమ పరిధిలోని ఎవరో ఒకరికి నిర్దేశించాలని చెప్పారు. అదే సమయంలో నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు.

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్.డి.ఓ. ఎం.వి.సూర్యకళ, ఎస్.డి.సిలు సూర్యనారాయణ, సుదర్శన దొర, పద్మలీల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**గ్రీవెన్సుకు 232 వినతులు :** కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల కార్యక్రమానికి 232 వినతులు అందాయి. ఇందులో రెవిన్యూకు సంబంధించి 173, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 15, మునిసిపల్ కార్పొరేషన్‌కు 14, గ్రామ వార్డు సచివాలయ శాఖకు12, గృహనిర్మాణ సంస్థకు 07, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖలకు 4 చొప్పున, డిఆర్‌డిఏకు 3 వినతులు అందాయి.

విభిన్నప్రతిభావంతుల శాఖ ద్వారా ఒక దివ్యాంగురాలికి జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి ఊతకర్రలు అందజేశారు.

జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు ఆరోగ్యమిత్రలకు ఒక్కొక్కరికీ ప్రోత్సాహక బహుమతి కింద రూ.5000 వంతున నగదు పారితోషికాలను, ప్రశంసాపత్రాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం అందజేశారు. ఏప్రిల్ నెలకు సూర్యనారాయణ, మే నెలకు మక్కువ కృష్ణశంకర్ లకు ఈ ప్రోత్సాహకాలను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.భాస్కరరావు, వై.ఎస్.ఆర్.ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి డా.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి బండారు పుట్టినరోజు వేడుకలు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పుట్టినరోజు వేడుకలను సోమవారం పరవాడ మండలం వెన్నెలపాలెం వారి స్వగృహమునందు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు కార్యకర్తలు, అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు టిడిపి కార్యకర్తలు పండ్లు , రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, అట్ట సన్యాసి అప్పారావు, పైల రామచంద్రరావు వియ్యపు చిన్న,, పైలా బుజ్జి, పైలా చిన అక్కు నాయుడు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి బండారుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన రామచంద్రరావు



**పరవాడ,(విశాఖ సమాచారమ్):** మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పుట్టినరోజు సందర్భంగా సోమవారం పరవాడ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు జిల్లా సాంస్కృతి విభాగం అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వీరితోపాటు మండల తెలుగు యువత అధ్యక్షులు పైలా చిన అక్కు నాయుడు, పరవాడ గ్రామ టిడిపి అధ్యక్షులు పైలా సన్యాసినాయుడు , చుక్కా వెంకట్రావు, పైల సింహాచలం నాయుడు, ప్రసాద్, శ్రీధర్, నర్సింగ్, చిన్న మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలు సంతృప్తి చెందేలా స్పందన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి



**శ్రీకాకుళం, (విశాఖ సమాచారమ్):** స్పందన, ఏపీ సేవా, మీసేవా కింద అందిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టండి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను సావదానంగా వింటూ, వివిధ సమస్యల పై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న స్పందన వినతుల స్వీకరణ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, ఇంచార్జ్ డిఆర్వో మురళీ కృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ అర్జీలు స్వీకరించారు.

ఎస్.ఎల్.ఎ పీరియడ్ అవ్వకముందే పిటిషన్ దారునితో మాట్లాడి వారికి వివరాలు తెలియజేసి పరిష్కరించాలన్నారు. ఎండోర్స్మెంట్ చేసేటప్పుడు అధికారులు దానిని నిర్ధారించి చేయాలన్నారు.

అర్జీదారునికి ఇచ్చే సమాధానం పూర్తి వివరాలుతో ఉండాలన్నారు, అధికారులు తమకు అందిన దరఖాస్తులను పూర్తిగా చదివి, ఒకవేళ అది తమ శాఖకు సంబంధించింది కానట్లయితే దానిని సంబంధిత అధికారులకు పంపాలని, ఇటువంటి దరఖాస్తులను మానిటర్ చేయాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖలలో అర్జీలు పై ఆరా తీశారు. అందరు విభాగాధిపతులు ప్రజల నుంచి వచ్చే అర్జీలు పట్ల అత్యంత శ్రద్ధ వహించి పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం వెబ్సైట్ ద్వారా, జగనన్నకు చెబుదాం లో 1902 నంబర్ కు ప్రజలు సమస్యలను తెలియ చేయడం జరుగుతోందన్నారు. ఈ సమస్యలను అన్నింటినీ గడువు లోపు నాణ్యతతో పరిష్కరించాలని, 1902 కు కాల్ చేసిన సమస్యలు సంబంధించిన శాఖల అధికారులకు పుష్ చేయబడతాయని, ఎప్పటి కప్పుడు ఈ లాగిన్స్ ఓపెన్ చేసుకుని సమస్యలను చూస్తూ ఉండాలన్నారు. రీ సర్వే పూర్తి అయిన సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు,

ఈ స్పందన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యం అధికారి బి.మీనాక్షి, డి.ఎస్.ఓ వెంకటరమణ, డ్వామా పి. డి చిట్టీ రాజు, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ వెంకట్ రామన్, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ "స్పందన" కార్యక్రమానికి 42 ఫిర్యాదులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రజల సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించవలసిందిగా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయవలసిందిగా జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు.స్పందన" ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారుసోమవారం పోలీసు స్పందన కార్యక్రమానికి 42 ఫిర్యాదు లలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు మరియు చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) శ్రీ బి.విజయభాస్కర్, ఎస్.బి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై చక్రధర్ పాల్గొన్నారు.

## సినీ ఆర్టిస్టులకు హెల్త్ కార్డ్ ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ మా గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** డాబా గార్డెన్స్ దగ్గర లో గల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డ్ లును సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (AP మా) గౌరవ అధ్యక్షులు , ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ గారు మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖ కు ఫిల్మ్ ఇండస్ట్రీ తరలిరావాలని, సీఎం జగన్మోహన్ రెడ్డి పలు రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారని తెలిపారు. సినీ పరిశ్రమకు అనువైన ప్రదేశంగా ఎంతో ఘనచరిత్ర కలిగిన మన విశాఖను సినిమా హబ్ కు నిలయమని అన్నారు. అనంతరం తోరం రాజ గారు ఏర్పాటు చేసిన హెల్త్ కార్డను పలువురు ఆర్టిస్టులకు వంశీ గారు, చైర్మన్ చేతులమీదుగా అందజేశారు.

కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, మురళి, వర్మ, సురేష్, రామారావు, వసు, రమేష్ పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని వినియోగించుకోవాలి



**విజయనగరం:** వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. పశు పోషణపై ఆధారపడిన పశు పోషకులకు ఆపత్కాలంలో ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించిన పోస్టర్లను, కర పత్రాలను కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మేలుజాతి పశువులు, నాటు పశువులు, గొర్రెలు, ఏకలు, పందులకు సైతం నిర్ణీత మొత్తాన్ని చెల్లించి బీమా సదుపాయాన్ని పొందవచ్చని చెప్పారు. వరదలు, తుఫానులు, పిడుగుపాటు, పాముకాటు, అడవిజంతువుల దాడి, అగ్ని ప్రమాదం, రోడ్డు, రైలు ప్రమాదం, జబ్బు చేసి చనిపోవడం తదితర సందర్భాల్లో బీమా పథకం వర్తిస్తుందని తెలిపారు. బీమా చేయించుకున్న పశు వులకు ఆయా రకాన్ని బట్టి, వయసును బట్టి రూ.30వేలు నుంచి రూ.15 వేలు వరకు, గొర్రెలు, మేకలు, పందులకు ఒక్కోదానికి రూ.6వేలు వరకు పరిహారాన్ని పొందే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్నవారు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం దారులు, తమ పశువులు, జీవాలు ప్రమాదవశాత్తూ మరణిస్తే, ఈ పథకం ఆయా కుటుంబాలను ఆదుకుంటుందని చెప్పారు. ప్రీమియం చెల్లించిన 24 గంటలు తరువాత ఈ పథకం వర్తిస్తుందని, పశువు మరణించిన 21 రోజుల్లోగా బీమా సొమ్ము అందుతుందని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన ఇతర వివరాలకు కోసం టోల్ ఫ్రీ నెంబరు 1962కు సంప్రదించవచ్చునని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్ఓ ఎం.గణపతిరావు, కెఆర్ఆర్సి ఎస్డిసి సూర్యనారాయణ, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## సైకిల్ పై కార్యాలయానికి చేరుకున్న జివిఎంసి కమిషనర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పర్యావరణ పరిరక్షణ నిమిత్తం జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ సోమవారం సైకిల్ తొక్కి అందరికీ ఆదర్శంగా నిలిచారు. కాలుష్య నియంత్రణకు కనీసం వారానికి ఒకరోజైనా నగర ప్రజలు తమ సొంత వాహనాలు వదిలేసి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటనలో కోరారు.

నగర మేయర్, జివిఎంసి సిబ్బంది ప్రతి సోమవారం ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ఉదయం తన బంగ్లా నుంచి జివిఎంసి కార్యాలయానికి సైకిల్‌పై ప్రయాణించారు. జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాల అనంతరం కూడా సైకిల్‌పైనే తిరిగి వెళ్లారు.

# ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ద్వారా రథ యాత్ర



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం నగరంలోని ఒడిస్సా కు సంబంధించిన ప్రధాన సామాజిక-సాంస్కృతిక సంస్థ ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ 20.06.2023 న పూరిలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రథయాత్ర మరియు 28.6.2023న తిరుగు యాత్ర (బహుదా) రోజుల్లో రథయాత్రను జరుపుకుంటున్నారు. జగన్నాథుడు, బలభద్రుడు మరియు దేవి సుభద్ర దేవతలను మోసే రథాన్ని దసపల్లా హిల్స్ వద్ద ఉన్న శ్రీ జగన్నాథ స్వామి ఆలయం నుండి భక్తులు సంకీర్తన మరియు సాంస్కృతికంగా రథయాత్ర జరుగును.

ఈరథయాత్ర చిల్డ్రన్స్ ఎరీనా, హెచ్ పి సి ఎల్ మిలీనియం బంక్, ఆంధ్రా యూనివర్శిటీ ఔట్ గేట్, వుడా పార్క్ మరియు శాంతి ఆశ్రమం ల మీదుగా లాసన్స్ బే కాలనీలోని శ్రీ గుండిచా ఆలయం వరకు రథాన్ని ఊరేగింపుగా రథాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగుతారు. పూర్ణిమ తర్వాత దేవతలు స్వస్థత పొందుతారు, మరియు 14 రోజుల విరామం తర్వాత 19.6.2023న తులసి పత్రాలతో అలంకరించబడిన నవ జౌబాన్ బేషలో తులసి బేష అని పిలువబడే దర్శనం ఇస్తారు. జూన్ 20, 2023 రథయాత్ర రోజున దేవతలను గర్భగుడి నుండి రథంపైకి తీసుకువెళతారు. పెహంది బిజె అని పిలువబడే ఒక ఆచారంలో దేవతలు కూర్చున్న రథం యొక్క ఛెరా పహన్రా అని పిలవబడిన తరువాత భక్తులు రథాన్ని లాగుతారు. కులం, మతం మరియు మతాలకు అతీతంగా సామాన్యులకు దర్శనం ఇవ్వాలనే కోరిక మేరకు ఈ రథయాత్ర ప్రతిబింబిస్తుంది. బెర్హంపూర్ (ఒడిశా) జోడి శంఖ మరియు రణపా నుండి సాంస్కృతిక బృందం మరియు ఒడిశాలోని వివిధ సంకీర్తనల బృందాలు ఊరేగింపుతో పాటుగా ఉంటాయి. దేవతలు 9 రోజుల పాటు శ్రీ గుండిచా ఆలయంలో మకాం వేసి, అదే మార్గంలో 28.6.2023 న బహుద యాత్ర అనే ప్రధాన ఆలయానికి తిరిగి వస్తారు.

విహార సమయంలో ప్రతిరోజూ భక్తుల కు అన్నప్రసాదం ఉంటుంది. మరియు దేవతలకు ఖాజా, లడ్డూ, మల్పువా మొదలైన జాతి రసాలను పాడి ప్రసాదంగా అందిస్తారు. భక్తులకు సరసమైన ధరకు దావూరీలు అందుబాటులో ఉంచబడతాయి.

28.6.2023న జరిగే బహుద యాత్రలో బృందాబన్ సాంస్కృతిక అనుస్థాన్కి చెందిన సాంస్కృతిక బృందం దారిలో దుల్దులిని ప్రదర్శిస్తుంది. దుల్దులి అనేది పెర్కషన్ మేళవింపు. బహుద యాత్రలో సాయంత్రం ప్రధాన ఆలయంలో భజన సంధ్య మరియు అన్నప్రసాద వితరణ ఉంటుందని సమాజ్ అధ్యక్షుడు శ్రీ జె కె నాయక్ మరియు ప్రధాన కార్యదర్శి శ్రీ బిమల్ కుమార్ మహంత తెలిపారు.

## ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు క్రీడాకారులను అభినందించిన శంకర్



జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ 53వ పుట్టినరోజు వేడుకలను నక్కపల్లి లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాల మాజీ అధికారి ప్రతినిధి మేడేటి శంకర్, డాక్టర్ రఘు ల ఆధ్వర్యంలో సోమవారం హాకీ క్రీడాకారుల మధ్య ఘనంగా నిర్వహించారు. క్రీడాకారులు శంకర్ కేక్ కట్ చేయించి భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ అంటూ నినాదాలు చేశారు ఈ సందర్భంగా బలిరెడ్డి హాకీ క్లబ్ నిర్వాహకులు రాంబాబు, కొలనాటి తాతాజీ ,నానాజీలను ఘనంగా సత్కరించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మేడేటి శంకర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ లాంటి యువ నాయకుడు నాయకత్వం ఈ దేశానికి అవసరాన్ని కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలో ఉంటే పేద బడుగు బలహీన వర్గాలకు నిత్యం సంతోషం ఉంటాదని అన్నారు. అన్ని వర్గాలకు సమాన న్యాయం జరగాలంటే ఒక కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని అటువంటి కాంగ్రెస్ పార్టీ 2024లో భారత దేశంలో జండా ఎగరనున్నదని శంకర్ అన్నారు .ముందుగా హాకీ క్రీడాకారులకు రాహుల్ గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకొని పాలు, గుడ్లు , స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బి .రఘు ,నీలి అశోక్ కుమార్ ,దేశెట్టి నాగేశ్వరరావు, జి .కిరణ్, ఎం. చిన్ని తదితరులు ఉన్నారు.

# స్పందనకు 316 అర్జీలు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం స్పందనలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టరు డా. కృతికాశుక్లా.. జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, ఇంచార్జ్ జెడ్పీ సీఈవో ఎ. రమణా రెడ్డిబీ బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ఈడీలు ఎస్.వీ.ఎస్. సుబ్బలక్ష్మి, డీఎస్ సునీతలతో కలిసి హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, పరిష్కారించవలసిందిగా ఆయా శాఖల అధికారులను కలెక్టరు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం-316 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనకు వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి తప్పనిసరిగా గడువులోపు సమస్య పరిష్కారం అయ్యే విధంగా అధికారులు ప్రత్యేక కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నం ఎంఈఓగా నాగేంద్ర

**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం మండల విద్యాశాఖ అధికారిగా నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు విశాఖలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆయనకు పదోన్నతి కల్పిస్తూ నర్సీపట్నం బదిలీ చేశారు. ఆయన వేములపూడి గవర్నమెంట్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఇంతవరకు ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన సాయిశైలజను పరవాడ బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరిగేలా కృషి చేస్తానని తెలిపారు. నాడు-నేడు పనులు వేగవంతం చేస్తామన్నారు. ఉత్తీర్ణత శాతం పెరిగేలా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామన్నారు.

# జెకెసి వినతులను ఏరోజుకారోజు పరిశీలించాలి



**విజయనగరం:** జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే వినతులన్నిటినీ తప్పనిసరిగా శతశాతం పరిష్కరించాలని, అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వాటిని సంపూర్ణంగా పరిష్కరించాలని సూచించారు. ప్రతీవారం దీనిపై సమీక్ష నిర్వహిస్తామని, ఎక్కడా పెండింగ్ ఉండకూడదని స్పష్టం చేశారు. ఏ రోజుకారోజు వచ్చిన వినతులను పరిశీలించాలని సూచించారు. అసంతృప్తి వ్యక్తం చేసిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జెకెసి వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్య పరిష్కారానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కూడా ఫిర్యాదుదారునికి అందజేయాలని సూచించారు. మండలాలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. కొన్ని రకాల అర్జీలపై, తమకు సంబంధం లేదని తప్పించుకోకూడదని, ఇతర శాఖలను సమన్వయం చేసుకొని వినతులను పరిష్కరించాలని సూచించారు. సచివాలయాలు, ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్ ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. నిర్మాణంలో ప్రగతి సరిగ్గా లేదని అన్నారు. వీటి నిర్మాణాన్ని వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్లంబింగ్, ఎలక్ట్రికల్ తదితర పనులన్నీ పూర్తి అయినప్పుడే, ఆ భవన నిర్మాణం పూర్తి చేసినట్లు పరిగణించడం జరుగుతుందని స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లులన్నీ చాలావరకు చెల్లించడం జరిగిందని, స్టేజ్ కన్వర్షన్ అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించిన ప్రతీ భవన నిర్మాణం పునః ప్రారంభించాలని ఆదేశించారు.

జగనన్నకు చెబుదాం, నాడు నేడు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణం, ఫ్యామిలీ ఫిజిషియన్ తదితర అంశాలపై, సోమవారం సాయంత్రం వెబెక్స్ ద్వారా మండలాలు, మున్సిపాల్టీల వారీగా సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తాశిల్దార్లు, ఎంపిడిఓలు, ఎంఈఓలు, మండల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులతో కౌన్సిలర్ సమావేశం



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం మున్సిపాలిటీ 16 వార్డు వైసిపి కార్యాలయంలో సోమవారం 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి ఆధ్వర్యంలో వాలంటీర్లు, కన్వీనర్లు గృహసారథులతో సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో చేసే కార్యాచరణ ప్రణాళిక గురించి మాట్లాడటం జరిగింది. ఇంతవరకు వార్డులో సుమారు కోటి 15 లక్షల రూపాయలు రోడ్లు నీటిపారుదల, శానిటేషన్, విద్యుత్ తదితర వాటి కోసం ఖర్చు చేయడం జరిగిందని, వాలంటీర్ వ్యవస్థ కన్వీనర్లు, గృహ సారథులను కలుపుకొని పోవాలని పెన్షన్లు ఇచ్చేటప్పుడు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలు వచ్చేటప్పుడు అందరూ చర్చించుకుని సమన్వయంతో పని చేసుకోవాలని తెలియజేయడం జరిగింది. ఇందులో భాగంగా చేయూత విద్యాదీవెన, విద్య వసతి, ఎక్కువ శాతం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ ఎంతో మేలు చేయడం జరిగిందని తెలియజేశారు.

ఈ నెల 26, 27 తేదీల్లో 16వ వార్డులో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పర్యటించను న్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ కలిసి జయప్రదం చేయాలని తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమం నందు 16వ వార్డు సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ రామ్మోహన్, అడ్మిన్ సెక్రెటరీ గోవిందరావు, కన్వీనర్ శ్రీనివాసరావు, వాలంటీర్లు మణి వరలక్ష్మి, గృహసారధులు పాల్గొన్నారు.

## జగనన్న అణిముత్యాల ప్రోత్సాహకాలు అందజేసిన వైస్ ఛైర్మన్ రామకృష్ణ



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం జెడ్పీహెచ్ పాఠశాలలో జగనన్న అణిముత్యాల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రంను ముఖ్య అతిధిగా విచ్చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ. అందజేశారు. అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఎండి.భాషా, నాయకులు యాదగిరి శేషు, పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.


**విశాఖ సమాచారమ్**

**ప్రతులకు, ప్రకటనలకు**

**సెల్: 9393949345**

**8247526179**


## ఆర్‌అండ్‌బి రోడ్డుకు మరమ్మత్తులు చేయించిన వైస్ చైర్మన్ రామకృష్ణ



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం మున్సిపాలిటీలోని ఎక్సైజ్ స్టేషన్ ఎదురుగా గల ఆర్‌అండ్‌బి రోడ్డు గుంతలు పడి వాహనాల రాకపోకలు ప్రజల చాలా ఇబ్బంది పడేవారు. దీన్ని గమనించిన మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ సోమవారం ఆర్‌అండ్‌బి అధికారులతో మాట్లాడి తక్షణం గుంతలు కప్పించి రోడ్డు మరమత్తులు దగ్గరుండి చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర పాల్గొన్నారు.


# శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం

- 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.
- మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.




# కార్డోరియం ప్లస్

కావల్సిన వారు సంప్రదించండి:

**9393949347**

మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను ధృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా అరగదీస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్‌ఎంపీ, పీఎంపీ, డీఏఎంపీ, బీఏఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్‌నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్‌షిప్ కొరకు సంప్రదించండి.స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.

**90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.**

**మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.**

**అందరూ ఆరోగ్యంగా ఉండండి.**



**జనహిత ట్రస్ట్(రి)**

9-3-16, పిఠాపురం కోలని,

విశాఖపట్నం- 530003

ఫోన్: 8247526179

compli

# విద్యుత్ అదనపు చార్జీలను వెంటనే తగ్గించాలి : సిపిఎం పార్టీ




**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర వ్యాప్తంగా పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ, ప్రభుత్వం గత సంవత్సరం కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై 14 వందల కోట్ల రూపాయలు భారం వేసింది. స్లాబ్లు మార్చివేసింది. ఇప్పుడు మళ్ళీ సర్దుబాటు ఛార్జీల పేరుతో 6వేల కోట్ల రూపాయలు భారం వేసింది. 2014 సంవత్సరంలో వాడుకున్న కరెంటుకు మళ్ళీ యూనిటు 20పైసలు, 2021 మే నెలలో వాడిన విద్యుత్ కు యూనిట్ కు మరో 20 పైస లు, 2023 ఏప్రిల్ నెలలో వినియోగించిన విద్యుత్ యూనిట్ కు మరో 40 పైసలు వెసి 80 పైస లు ప్రతి యూనిట్పై అదనపు ఛార్జీలు పెంచారు. ఇవి ప్రజలు మోయలేని భారం. సంవత్సరాల తరబడి ప్రజలు వాడిన విద్యుతు బిల్లులు చెల్లించారు. ఇప్పుడు మళ్ళీ వాటిపై అదనపు ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం. ప్రజలపై విద్యుత్ భారాలు వేయమని ప్రభుత్వ హామీ ఇచ్చి ఫిక్సిడ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీల పేరుతో దొడ్డిదారిన ప్రజల నడ్డి విరచడం అన్యాయం. ఈ ఛార్జీలను వెంటనే రద్దుచేయాలి.

గృహ వినియోగదారులకు, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్మీటర్లు పెట్టటానికి సిద్ధపుడుతున్నారు. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలను, అన్నదాతలను నిలువునా ముంచడమే అవుతుంది. ఇప్పటికే ప్రజలు, రైతులు ధరల భారాలు, సరైన ఆదాయాలు లేక కష్టాల కడలిలో ఉన్నారు. ఇవి ప్రభుత్వ చర్యలు వీరిని మరింత అగాధంలోకి నెట్టడం ఖాయం. కనుక తమరు వెంటనే జోక్యం చేసుకొని పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్మీటర్లు రద్దుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని ఆరిలోవ సబ్ స్టేషన్ విశాలక్షి నగర్ సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేసి ఏ ఈ లకు వినతి పత్రం అందజేశారు . ఈ కార్యక్రమం లో సి.పి.ఎం పార్టీ అరీలోవ జోన్ సెక్రెటరీ వి.నరేంద్ర కుమార్, సి.పి.ఎం పార్టీ జోన్ కార్యవర్గ సభ్యులు వి.శంకరరావు, డి. నాగరాజు, ఎస్. గౌరమ్మ, సి.ఐ.టి.యు సెక్రెటరీ ఎ. రమణ, మహిళ సంఘం జోన్ సభ్యులు సన్యాసమ్మ పి.ఎన్.ఎం జోన్ సెక్రెటరీ వై.అప్పారావు,పి.ఎన్.ఎం కమిటీ సభ్యులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురం కాలనీ సమాచారం


ఆల్ఫా ఫుడ్ కోర్ట్, కళాభారతి రోడ్డు, మద్దిలపాలెం


రబ్బాని మిల్క్ ఫుడ్స్, కళాభారతి రోడ్డు, మద్దిలపాలెం

క్లాసిఫైడ్స్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8186030813,
7981904385




## డాక్యుమెంట్లు పోయినవి

అవనాపు శ్రీనివాస్ (తండ్రి) అవనాపు జగ్గారావు గారికి చెందిన వ్యాసం శకుంతలగా పేరున గల లింకు డాక్యుమెంట్ నెంబరు డిఓసి నెం. 4893/2016 మరియు కలివరపు శిరీష గారి పేరున గల డాక్యుమెంట్ 1722/2013 మద్దిలపాలెం నుండి సిరిపురం జంక్షన్కు మోటార్ సైకిల్పై వెళ్లుచుండగా జారిపడిపోయినవి.

ఎవరికైనా దొరికినచో దయచేసి తెలియజేయండి.

**ఫోన్ : 76609 79777**

**అవనాపు శ్రీనివాస్**

# 21వ తేదిన 9వ అంతర్జాజీయ యోగా దినోత్సవ వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 21వ తేదీన జిల్లాలో జరుగు 9వ ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున పేర్కొన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ భారతి ఇన్డోర్ స్టేడియంలో 9వ ప్రపంచ యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించబడునని పేర్కొన్నారు. ఉద్యోగులు, ప్రజలు , ఆసక్తి గల యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. స్టేడియం ఆవరణలో పారిశుధ్య పనులు, త్రాగు నీటి సౌకర్యం కల్పించాలని జివియంసి అధికారులకు ఆదేశించారు. స్టేడియం వద్ద అంబులెన్సును ఏర్పాటు చేయాలని, ఆరోగ్య సిబ్బందిని ఉంచాలని వైద్యశాఖ అధికారులను, విద్యుత్ అంతరాయం కలుగుండా చూడాలని ఎపిఈపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలని, ఎటువంటి ఆటంకం తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులకు ఆదేశించారు. హార్టికల్చర్ అధికారులు స్టేడియం అంతటా సుందరీకరణ పనులను చేపట్టాలన్నారు. ఆసక్తిగా ఉన్న పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించాలని డిఇఓ ను ఆదేశించారు. యువజన శాఖ అధికారులు %చీజజ, చీూా% విద్యార్థులను ఎక్కువ శాతంలో పాల్గొనేలా ఆహ్వానించాలన్నారు.

అనంతరం అంతర్జాజీయ యోగా దినోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్, ఆర్డీఓ హుస్సేన సాహెబ్, ఆయుష్ శాఖ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు, ఆయుష్ వైద్యాధికారులు, పతాంజలి, ఆర్ట్ ఆఫ్ లివింగ్, నేచర్ క్యూర్ , పుష్పాంజలి ఆంధ్ర యూనివర్సిటీ యోగా విలేజ్ మొదలగు సంస్థల నుంచి ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# "జగనన్నకు చెబుదాం" కార్యక్రమానికి 77 వినతులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జివిఎంసిలో "జగనన్నకు చెబుదాం" అనే కార్యక్రమానికి 77 వినతులు వచ్చాయని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. సోమవారం అయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రెండవ జోనుకు 12, మూడవ జోనుకు 5, నాలుగవ జోనుకు 14, ఐదవ జోనుకు 6, ఆరవ జోనుకు 16, ఏడవ జోనుకు 2, ఎనిమిదవ జోనుకు 5, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి సంబంధించి 17 ఫిర్యాదులు అందాయని, అలాగే పరిపాలన విభాగానికి ఒకటి, రెవిన్యూ విభాగానికి 9, ప్రజా ఆరోగ్య విభాగానికి 6, టౌన్ ప్లానింగ్ విభాగానికి 27, ఇంజనీరింగ్ విభాగానికి 25, మొక్కల విభాగానికి 2, యుసిడి విభాగానికి 7, మొత్తం 77 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు.

ప్రతి సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం నిర్వహిస్తున్న "జగనన్నకు చెబుదాం" కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన వినతులు, సలహాలు ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారాన్ని తర్వాత వచ్చే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సమర్పించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు, ప్రధాన ఇంజనీర్ రవికృష్ణ రాజు, సి.సి.పి. సునీత, సి.ఎం.ఓ.హెచ్. డాక్టర్ సురేష్ కుమార్, కార్యదర్శి నల్లనయ్య, డి.సి. (రెవెన్యూ) పణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, డి.డి.హెచ్. దామోదర్ రావు, ఎఫ్ ఏ & ఏవో మల్లికాంబ, డిపిఓ చంద్రిక, పర్యవేక్షి ఇంజనీరు కె.వి.ఎన్.రవి, వినయ్ కుమార్, వేణుగోపాలరావు, కృష్ణారావు, గోవిందరావు, రామ్మోహన్రావు, శాంసన్ రాజు, బయాలజిస్ట్ చక్రవర్తి, టిపిఆర్ఓ సూర్యకళ, డీసీపీలు, ఏసీపీలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## పిఠాపురం కాలనీ సమాచారం

త్వరలో వెలువడనున్న పిఠాపురం కాలనీ సమాచారం ప్రత్యేక సంచికలో స్థానికంగా ఉన్న దుకాణదారులు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, హోటళ్లు, వైద్యులు, న్యాయవాదులు, ఆసుపత్రులు, పురోహితులు, దేవాలయాలు, సంగీత పాఠశాలలు తదితర వివరములు అందించబడతాయి. ఈ సమాచారం పూర్తిగా ఉచితంగా ప్రచురించబడుతుంది.

మీ సంస్థకు లేదా దుకాణానికి సంబంధించిన వివరములు నమోదు చేసుకునేందుకు వాట్సాప్ ద్వారా 7013785256 నెంబరుకు మీ వివరములు/విజిటింగ్ కార్డు పంపించండి. ఈ ప్రత్యేక సంచికలో ప్రకటనల కొరకు మరియు ప్రతీరోజు పత్రిక కొరకు సుధాకర్ సెల్ : 7981904385, తులసీరామ్ : సెల్ : 8186030813 నెంబర్లకు సంప్రదించండి.

**విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రిక,**
**9-3-16, పిఠాపురం కాలనీ, విశాఖపట్నం-530003**
**ఫోన్ : 9393949345**

## పాఠకులకు హెచ్చరిక

విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**సెల్: 8186030813**

# ఈవీఎం, వీవీప్యాట్ గోదాము భద్రతకు పటిష్ట చర్యలు

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల)ల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా ఎన్నికలు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును కలెక్టర్ కృతికా శుక్లా..రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని కలెక్టరు వివరించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబు (టీడీపీ),



రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), సబ్బారపు అప్పారావు (బీఎస్పీ), కె.విజయరామరావు (భాజపా), టి.మధు (సీపీఎం), కాకినాడ ఆర్డీవో ఎన్.వీ.వీ. సత్యనారాయణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎన్. సురేంద్ర ఆనంద్, కాకినాడ పట్టణం తహసీల్దార్ సీతాపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు ఎం.జగన్నాథం, సీహెచ్.లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8186030813.